

ఎలా!?

ఎన్ని గ్రామసభలు నిర్వహించినా.. మరిన్ని సమావేశాల ద్వారా అర్జీలు స్వీకరించినా రెవెన్యూ సమస్యలు మాత్రం పరిష్కారం కానంటున్నాయి. మరోవైపు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం (గ్రీవెన్స్)లో భూ సమస్యలకు సంబంధించిన అర్జీల సంఖ్య మాత్రం తరగడం లేదు. ఈ ప్రభావం అటు ప్రజలపై తీవ్రంగా పడుతుండగా, ఇటు అధికారులకు కూడా ఇబ్బందిగా మారుతోంది. జిల్లా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఒకసారి వచ్చిన అర్జీదారుడే మళ్లీ అదే సమస్యతో ఉన్నతాధికారుల వద్దకు వస్తున్నారు. మరోవైపు ఈ అర్జీల పరిష్కారంపై ఆడిట్ నిర్వహిస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

- జిల్లాలో విపరీతంగా భూ సమస్యలు
- కుప్పలు తెప్పలుగా వస్తున్న అర్జీలు
- గ్రామసభల్లో వేల సంఖ్యలో నమోదు
- అయినా గ్రీవెన్స్‌లో తగ్గని విజ్ఞప్తుల సంఖ్య
- పరిష్కారంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ సమస్యలపై దృష్టి పెట్టింది. గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే ద్వారా అనేక కొత్త సమస్యలు వచ్చాయని గుర్తించిన ప్రభుత్వం.. తొలుత రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సదస్సులు నిర్వహించింది. 300లకుపైగా గ్రామాల్లో గతేడాది అక్టోబరు 19 నుంచి నవంబరు 14వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు జరిగాయి. అప్పుడు 8,406 అర్జీలు ప్రజల నుంచి అందాయి. ఆ తర్వాత మరోసారి గతేడాది డిసెంబరు 6 నుంచి ఈ ఏడాది జనవరి 8వ తేదీ వరకూ జిల్లాలో 731 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈదఫా 8,132 అర్జీలు భూ సమస్యలకు సంబంధించి అధికారులకు అందాయి. వీటన్నిటినీ ఆన్‌లైన్ చేసిన అధికారులు.. పరిష్కారానికై క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందికి పంపారు. ఇప్పటికే సగం వరకూ అర్జీలు పరిష్కారమైనట్లు లెక్కలు చూపిస్తున్నారు.

సమస్య ఎక్కడ..?

భూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని కూటమి ప్రభుత్వం పదే పదే ఆదేశిస్తోంది. అయితే ప్రభుత్వం ఆశించిన స్థాయిలో భూ సమస్యల పరిష్కారం జరగడం లేదని లెక్కలు చూస్తే అర్థమవుతోంది. ఇందుకు అనేక కారణాలే కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం ప్రధాన కారణమైతే.. కొన్ని సమస్యలకు రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉండటం కూడా మరో కారణంగా అధికారులు చెబుతున్నారు. తన భూమిని మరొకరి పేరుపై అక్రమంగా మ్యుటేషన్ చేశారని ఓ వ్యక్తి ఇప్పటికి పలుమార్లు అర్జీలు పెట్టుకున్నా ఆ సమస్య పరిష్కారం కాకపోవడంతో సదరు బాధితుడు పదే పదే కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నాడు. ఇది పరిష్కరించగలిగిన సమస్య అయినా క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా పరిష్కారం కావడం లేదు. అలానే మరోవ్యక్తి.. రీసర్వేలో తప్పు ఖాతా నంబర్ ఇచ్చారని, దీనిని సరి చేయాలని అర్జీల మీద అర్జీలు పెట్టుకుంటున్నాడు. అయితే ఈ సమస్యను పరిష్కరించేందుకు జిల్లాస్థాయిలో అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. కలెక్టరేట్‌లోని ఆడిట్ సెల్ ప్రతి అర్జీదారుడితో నేరుగా మాట్లాడుతూ వారి సంతృప్తి తెలుసుకుంటోంది. చేయగలిగి ఉండి కూడా పరిష్కారం కాని సమస్యలను రీ ఓపెన్ చేస్తున్నారు. ఇటువంటివి ప్రస్తుతం జిల్లాలో 500లకుపైగా ఉన్నాయి. జిల్లా లో 18 మంది అధికారులు కూడా ర్యాండమ్‌గా ఆడిట్ చేస్తుండగా వారు కూడా కొన్ని అర్జీలను రీ ఓపెన్ చేస్తుండటం గమనార్హం. అంటే క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు ఇక్కడ అర్థమవుతోంది. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటే గానీ పరిస్థితుల్లో మార్పు రాదన్న అభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో కొన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ నిర్ణయం అవసరం. అయితే ఆ విషయాలను అర్జీదారులకు అర్థమయ్యే విధంగా చెప్పడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమవుతోంది. ఈ కారణంగా కూడా బాధితులు పదే పదే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

రెండు విడతల్లో జరిగిన గ్రామసభల్లో 16 వేలకుపైగా అర్జీలు నమోదైనా అర్జీల రాక మాత్రం తగ్గడం లేదు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో జనవరి 27వ తేదీన జరిగిన ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 407 అర్జీలు రాగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవే 157 ఉన్నాయి. అలానే ఈ నెల 3వ తేదీ జరిగిన కార్యక్రమంలో మొత్తం 294 అర్జీలు రాగా అందులో రెవెన్యూ శాఖవి 128 ఉన్నాయి. సోమవారం (10వ తేదీన) 409 అర్జీలు రాగా అందులో 160 అర్జీలు రెవెన్యూ శాఖకు చెందినవే కావడం గమనార్హం.

సవరణ చేయాలని తిరుగుతున్నా..

నా భార్య పేరుతో అల్లూరు మండలం పడమర గోగులపల్లిలో 1.4 ఎకరాల భూమి ఉంది. గత ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. అయితే రీసర్వేలో సర్వే నెంబర్లలో భిన్నాలు ఏర్పాటు చేసి ఒక్క సర్వేనెంబరుకు మూడు భిన్నాలు ఏర్పాటు చేసి వెబ్‌ల్యాండ్ రికార్డును మంజూరు చేశారు. ఈ రికార్డుతో రుణం పొందాలంటే బ్యాంకర్లు తిరస్కరిస్తున్నారు. సవరణ చేయమని అధికారులకు ఇస్తే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

- మైపాటి రాజేంద్ర ప్రసాద్, అల్లూరు

సమస్యలు పకడ్బందీగా పరిష్కరించాలి

మా గ్రామంలో అత్యధికంగా భూ సమస్యలున్నాయి. గతంలో రీసర్వే ప్రక్రియతో ఈ సమస్య నెలకొంది. అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించినా పరిష్కారం లభించలేదు.

- ఆట తిరుమల, సర్పంచి, పడమర గోగులపల్లి, అల్లూరు

ఈ మొండిగోడలకు మోక్షం!

- బీసీ భవన్ నిర్మాణంలో కదలిక
- కొత్త అంచనాలతో ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌కు ఆదేశం

ఒక అసమర్థపు ప్రభుత్వ పాలన ఎంతమందిపై ప్రభావం చూపుతుందో అనడానికి నిదర్శనమే బీసీ భవన్. తమకూ ఓ భవనం నిర్మించండి.. మా శుభకార్యాలు, ఇతర అవసరాలను తక్కువ ఖర్చుతో ఇక్కడే తీర్చుకుంటాం.. అంటూ బీసీ కులస్థులు కోరిన న్యాయమైన కోరికను నాటి వైసీపీ సర్కారు తుంచేసింది. తను మంచి కార్యక్రమం చేయడం అటుంచితే జరుగుతున్న పనిని కూడా ఆపేసిన ఘనత గత ప్రభుత్వానికే దక్కింది. దీంతో ఎన్నో ఏళ్ల తమ కోరిక నెరవేరుతుందని సంతోషించిన బీసీలకు నిరాశే ఎదురయ్యింది. నెల్లూరులో ప్రారంభమైన బీసీ భవన్ నిర్మాణ పనులు గత ఐదేళ్లలో పడకేశాయి. ఏదో కక్షగట్టినట్లుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం వేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసినంత స్పీడుగా వైసీపీ నేతలు భవనాన్ని నిర్మించలేకపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పాలనలో ఈ భవన్ నిర్మాణంలో కదలిక వచ్చింది. మరి ఇప్పుడైనా స్పీడుగా బీసీ భవన్ నిర్మాణం పూర్తవుతుందా? అన్నదే చర్చనీయాంశంగా మారింది.



పునాదుల దశలోనే ఆగిపోయిన బీసీ భవన్

6

మెయిన్స్‌లో మెరిశారు!

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఫలితాలు మంగళశారం విడుదలయ్యాయి. ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు తాజాగా విద్యార్థులు సాధించిన పర్సంటైల్ స్కోర్‌తో ఫలితాలను విడుదల చేశారు. జనవరి 22 నుంచి 24వ తేదీ వరకు ఒక విడత, 28, 29వ తేదీలలో నిర్వహించిన రెండో విడతలో పేపర్-1 పరీక్షలు నిర్వహించారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పర్యవేక్షణలో టీసీఎస్ నిర్వహించిన ఈ పరీక్షలకు జిల్లాలో 6వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల్లో జిల్లా విద్యార్థులు పలు విభాగాల్లో సత్తాచాటుతూ ర్యాంకులను సొంతం చేసుకున్నారు. మొత్తం మీద 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి.

- ఏప్రిల్ 1 నుంచి రెండోవిడత

జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 8వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టీఏ అధికారులు ప్రకటించారు. తొలివిడత పరీక్షల్లో సాధించిన స్కోరుతో సంతృప్తి చెందని వారు రెండో విడత పరీక్షలు రాస్తుంటారు. ఈ రెండింటిలో ఉత్తమ స్కోరును పరిగణలోకి తీసుకుని విద్యార్థులకు ర్యాంకులు కేటాయిస్తారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సెలింగ్ ద్వారా ఐఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

- 80 శాతం మంది ఉత్తీర్ణత

- నారాయణకు ఉత్తమ మార్కులు..

జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. కె.పూర్వజ్ మ్యాథ్స్‌లో వందకు వందతో పాటు 99.98 పర్సంటైల్ సాధించారు. కె.మధుకిరణ్‌రెడ్డి 99.93, బి.భాను రిషిక్ 99.92, ఎం.అఖిలేష్ 99.91, ఎం.హేమంత్‌సాయి 99.84, సిహెచ్.నరసింహతేజ 99.76, కె.అక్షిత 99,74, జి.సంతోష్ 99.71, ఇ.యశ్వంత్ బాబి 99.70 పర్సంటైల్ సాధించారని ఆ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వి.విజయ భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పెంచింది 10.. తీసుకుంటున్నది 40

- మద్యం వ్యాపారుల దోపిడీ



నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలు పెంచితే ఇదే అదనుగా వ్యాపారులు నాలుగింతలు ఎక్కువగా వసూలు చేస్తూ మందు బాబులను దోచేస్తున్నారు. క్వార్టర్ నుంచి ఫుల్ వరకు ఏదైనా బాటిల్‌పై రూ.10 రూపాయలు చొప్పున ప్రభుత్వం పెంచింది. బీర్ ధరలు పెంచలేదు. అయితే వైన్‌షాపులు, బార్లలో మాత్రం క్వార్టర్‌పై రూ.10, హాఫ్‌పై రూ.20, ఫుల్‌పై రూ.40 అధికంగా వసూలు చేస్తున్నారు. కొన్నిచోట్ల బీర్ ధరలు కూడా పెంచేశారు. ఈ విషయం ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడైంది. ఆంధ్రజ్యోతి మంగళవారం నెల్లూరులోని కొన్ని మద్యం దుకాణాలను విజిట్ చేసింది. ధరల విషయమై అక్కడి మందుబాబులతో మాట్లాడగా పెంచిన ధర కన్నా ఎక్కువ వసూలు చేస్తున్నారని చెప్పారు. దీనిపై వైన్‌షాపుల్లోని క్యాషియర్లను ప్రశ్నించగా ధరలు పెరిగాయని... క్వార్టర్‌పై రూ.10, ఫుల్‌పై రూ.40 పెరిగిందని సమాధానం ఇచ్చారు. ఇదే విషయాన్ని ఓ క్యాషియర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు కూడా కరాఖండిగా చెప్పడం విశేషం.

కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు

మద్యం ధరలు పెరిగినప్పుడు, తగ్గినప్పుడు ఎక్సైజ్ అధికారులు ఆయా స్టేషన్ల పరిధిలోని షాపుల్లో సవరించిన ధరలు అమలయ్యేలా పర్యవేక్షించాలి. ధరల పట్టికలో మార్పులు చేసేలా చర్యలు తీసుకోవాలి. కానీ, జిల్లాలో ఎక్సైజ్ అధికారులు మాత్రం అవేవీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

బాటిల్‌పై రూ.10 మాత్రమే పెరిగింది

ప్రభుత్వం విడుదల చేసిన జీవో మేరకు లిక్కర్‌పై మాత్రమే ధరలు పెరిగాయి. బీర్ ధరలు పెరగలేదు. క్వార్టర్, హాఫ్, ఫుల్.... ఏ బాటిల్‌పైన అయినా రూ.10 మాత్ర మే పెరిగింది. ఈ విషయాన్ని వైన్‌షాపుల యజమానులకు వివరంగా తెలియజేశా ము. అధిక ధరలు వసూలు చేసేవారిపై చర్యలు తప్పవు.

- శ్రీనివాసరావు : డీసీ, దయాసాగర్ : ఏసీ

నాయనా లేవరా.. మాట్లాడరా!!

- వాగులో తల్లిని కాపాడబోయి కొడుకు మృతి
- గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు



కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లిదండ్రులు



ఆకాష్ (ఫైల్)

"నాయనా ఆకాష్ లేవరా! ఒకసారి మాట్లాడరా!? ఓ దేవుడా మేమేం పాపం చేశాం. చేతికి ఎదిగి వచ్చిన కొడుకును కానీయకుండా చేశావే!' నంటూ కన్నబిడ్డ మృతదేహంపై పడి ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. వీరి రోదనను చూసిన స్థానికుల్లోనూ కంట తడి తెప్పించింది. అనంతసాగరం మండలం శంకరనగరంలో మంగళవారం తల్లిని కాపాడబోయి ఓ యువకుడు నదిలో పడి మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. శంకరనగరానికి చెందిన ఉప్పలపాటి కొండయ్య, శోభలకు ఇద్దరు సంతానం. ఇటీవల కావలిలో బీటెక్ పూర్తి చేసిన పెద్ద కుమారుడు ఆకాష్ ఇంటికి వచ్చి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. మంగళవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో పచ్చి గడ్డి కోసం తల్లితో కలిసి వెళ్లాడు. గడ్డి కోసుకొని వచ్చే క్రమంలో తల్లి శోభ కొమ్మలేరువాగు దాటుతూ బురదలో ఇరుక్కు పోయింది. అమ్మను బయటకు లాగే క్రమంలో ఆకాష్ (22) వాగులో పడిపోయాడు. ఆకాష్‌కు ఈత రాకపోవడంతో నీటిలో గల్లంతు అయ్యాడు. నీటిలో కొట్టుకుపోతున్న కొడుకును చూసి తల్లి బిగ్గరగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న ఒక వ్యక్తి నీటిలో దూకి రక్షించే ప్రయత్నం చేయగా అప్పటికే ఆకాష్ మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. చేతికందిన కుమారుడు అనంతలోకాలకు చేరుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీర య్యారు. బిడ్డ మృతదేహంపై పడి 'నువ్వు లేకుండా మేము బతికేదెలా!?' అంటూ గుండెలు పగిలేలా రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది. సమాచారం తెలుసుకొన్న అనంతసాగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

మనీ స్కాంలో పోలీసుల పాత్ర

- విచారించిన కావలి డీఎస్పీ
- ఇద్దరు కానిస్టేబుళ్లపై ఎస్పీ వేటు
- మరికొందరిపైనా చర్యలు తప్పవా!?

కావలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ముసునూరు మర్రిచెట్టు గిరిజన కాలనీ కేంద్రంగా గుంటూరుకు చెందిన షేక్ మహబూబ్ సుభాన్ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో నిర్వహిస్తున్న మనీ స్కాంలో పాత్రధారులైన ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు పడింది. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన వట్టికాల రాధాకృష్ణయ్య, జ్యోతి అయోధ్యలను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కృష్ణ కాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్కాంలో అనేక మంది పోలీసుల సహకారం ఉన్నప్పటికీ ప్రధాన సూత్రధారులుగా ఈ ఇద్దరు కానిస్టేబుళ్లు ఉండటంతో కావలి డీఎస్పీ పి.శ్రీధర్ విచారించారు. స్కాంలో వారి పాత్ర నిజమని నిర్ధారిస్తూ ఎస్పీకి నివేదిక అందచేశారు. ఆ నివేదిక ఆదారంగా ఎస్పీ ఆ ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెండ్ వేటు వేశారు. అయితే, ఇంకా అనేక మంది పోలీసులు ఈ స్కాంలో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. భవిష్యత్తులో అధికారులు చేపట్టే విచారణలో ఎవరెవరి పేర్లు బయటకు వస్తాయోనని అందరిలో ఆందోళన నెలకొంది.

- ఇల్లు, కార్యాలయంలో తనిఖీలు

మనీ స్కాం నిర్వాహకుడు షేక్ మహబూబ్ సుభాన్ కార్యాలయం, ఇంటి తాళాలను మంగళవారం కావలి తహసీల్దార్ పీ. శ్రావణ్‌కుమార్ సమక్షంలో డీఎస్పీ పీ.శ్రీధర్ పర్యవేక్షణలో పోలీస్‌లు పగలగొట్టారు. అనంతరం కార్యాలయం, ఇంటిలో విస్తృత తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, కొంత నగదును సీజ్ చేసినట్లు తెలిసింది. కొన్ని ప్లాట్లు, జలదంకి మండలంలో కొంత పొలానికి సంబంధించిన డాక్యుమెంట్లు దొరికినట్లు తెలిసింది. అయితే, ఆన్‌లైన్ ట్రేడింగ్ లావాదేవీలకు సంబంధించిన కంప్యూటర్ డిస్క్‌లు ముందుగానే సుభాన్ మాయం చేసినట్లు తెలిసింది. ఈ వ్యవ హారంపై పోలీసులు లోతైన విచారణ చేపట్టి, స్కాంలో సూత్ర, పాత్రధారుల వివరాలు సేకరించే పనిలో పడ్డారు. ఈ తనిఖీ లలో సీఐలు ఫిరోజ్, గిరిబాబు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

సీబీసీఐడీ విచారణ చేట్టాలి

ఆన్‌లైన్ ట్రేడింగ్ మనీ స్కాంపై సీబీసీఐడీ విచారణ చేపట్టాలని జిల్లా టెలికాం సభ్యులు, బీజేపీ నేత కే. బ్రహ్మా నందం పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి బోర్డు తిప్పేసిన షేక్ మహబూబ్ సుభాన్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సదరు సంస్థ నుంచి సొమ్మును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. బీజేపీ తరఫున బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కిరణ్, వెంకటేశ్వర్లు, సుజి, మురళీకృష్ణ, తిరుపతి స్వామి పాల్గొన్నారు.



సుభాన్ కార్యాలయ గది తలుపులు పగలగొడుతున్న పోలీసులు





కానిస్టేబుళ్లు అయోధ్య, రాధాకృష్ణయ్య

297 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 297 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి తెలిపారు. మంగళవారం మండలంలోని పంచేడు రైతు సేవా కేంద్రంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజనులో కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048, వరి రకాలను రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారన్నారు. ఈ మేరకు ఈ పంట నమోదు చేయించుకోవాలని, అందులో నమోదైన రైతుల ధాన్యం మాత్రమే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తారని తెలిపారు. అలాగే ఈకేవైసీ కూడా చేయించుకోవాలన్నారు. అదేవిధంగా భూమి ఉన్న ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇచ్చేందుకు ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తుందని, ఇందుకు రైతులు సహకరించా లని కోరారు. వ్యవసాయ సహాయ సంచాలకులు సర్వేజీరావు వరి సాగులో మెళకువలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు శేషగిరి, మండల వ్యవసాయాధికారి సురేంద్ర రెడ్డి, ఏఈవో ఎస్ ఇందు, వీఏఏ కే.సుజాత, మాజీ వవ్వేరు బ్యాంకు ఛైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.





రాక్ బీచ్ రాకింగ్ !

ముత్తుకూరు మండలం నేలటూరు గ్రామంలోని బీచ్ సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటోంది. ఇక్కడి థర్మల్ ప్రాజెక్టు పక్కనే సముద్రతీరం ఉంది. ఆ కర్మాగారానికి అనుసంధానంగా సాగరంలోకి మార్గం ఏర్పాటు చేశారు. కెరటాల తాకిడిని తట్టుకునేందుకు భారీస్థాయిలో అమర్చిన కాంక్రీట్ దిమ్మెలు, వాటిపై వేసిన సిమెంటు రోడ్డు యువతను ఆకర్షిస్తోంది. పెద్ద అలలు వచ్చి కాంక్రీట్ దిమ్మెలకు తగిలినప్పుడు ఎగిరిపడే నీటి తుంపర్లు ప్రత్యేక అనుభూతినిస్తున్నాయి. అలాగే, ఇక్కడ సముద్రంలో బోటింగ్‌కు కూడా అవకాశం ఉంది. దీంతో వారాంతంలో సందర్శకుల సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా షార్ట్ వీడియోలు, రీల్స్ షూట్ చేయడానికి యూత్ ఈ బీచ్‌ను ఎంచుకుంటోంది. అయితే, సరైన రోడ్డు మార్గం, వసతులు లేకపోవడం సందర్శకులకు కొంత అసౌకర్యం కలిగిస్తోంది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మందులు నిల్వ ఉంచుకోవాలి

● డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా నిల్వ చేసుకోవా లని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. మంగ ళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫార్మాసిస్టులతో ఆమె సమీక్ష నిర్వ హించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రంలో మందులు, పిల్లలకు వేసే టీకాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, ఎపిడమాలజిస్టు డాక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

గంగపుత్రులకు చేయూత

- వేట విరామ భృతి రూ.20 వేలకు పెంపు
- 12,440 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై కడలిపుత్రుల ఆనందం

కావలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు నెలలపాటు ఉచితంగా బియ్యం ఇచ్చేవారు. ఆ తర్వాత అధికారం లోకి వచ్చిన తెలుగుదేశం వేట విరామ భృతి కింద రూ.4 వేలు అందజే సింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ భృతిని రూ.10 వేలకు పెంచింది. అయితే వివిధ కొర్రీలు పెట్టడంతో అర్హులు కూడా విరామ భృతికి దూరమయ్యారు. అయితే మత్స్యకారుల సాధక బాధకాలు తెలిసిన కూటమి ప్రభుత్వం భృతిని రెట్టింపు చేస్తూ రూ.20 వేలకు పెంచింది.

ఏప్రిల్ 15 నుంచి వేట విరామం

యేటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో చేప పిల్లలు ఉత్పత్తి జరిగే సీజన్ కావటంతో ఆ సమయంలో మత్స్య సంపదను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేట విరామం ప్రక టిస్తోంది. దీంతో ఆ రెండు నెలలు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా నిషేధి స్తారు. అయితే, సముద్రపు వేటే జీవనా ధారంగా ఉండే మత్స్యకార కుటుం బాలు వేట విరామ సమయంలో జీవనోపా ధి పొందేందుకు ప్రభుత్వం వారికి భృతిని అందచేస్తుంది. ఆ భృతిని కూటమి ప్రభుత్వం రూ.20 వేలకు పెంచింది. జిల్లాలో సుమారు 18 వేల మత్స్యకార కుటుంబాలు ఉండగా వీరిలో వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందే వారు కాకుండా కేవలం సముద్ర వేటపైనే ఆదారపడి జీవించే వారిని, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ అయిన బోట్ల ద్వారా 12,440 కుటుం బాలను అధికారులు గుర్తించారు. వీరికి భృతి అందచేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వేట విరామ భృతి పెంచడంతో మత్స్య కార కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



వల విసురుతున్న మత్స్యకారుడు



జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద వలలను సరిచేసుకుంటున్న మత్స్యకారులు

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు వేట విరామ భృతిని పెంచుతూ నిర్ణయిం తీసుకుంది. రూ.20వేల వరకు పెంచడంతో జిల్లాకు రూ.24.88 కోట్ల నిధులు రానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంప డంతో విరామ సమయం లోపు ఆ నిధులు మత్స్యకారుల బ్యాంకు ఖాతాలలో జమకానున్నాయి.

గంగపుత్రులకు ఎంతో ఊరట



కూటమి ప్రభుత్వం విరామ భృతి పెం చటం గంగపుత్రు లకు ఎంతో ఊరటనిస్తుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వడమేగాక అది కూడా నాలుగు పర్యాయాలు మాత్రమే ఇచ్చి ఒక పర్యాయం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో మత్స్యకారుల జీవనోపాధికి ఢోకా ఉండదు.

- ఆవుల త్యాగరాజు, తాటిచెట్లపాలెం, బోగోలు మండలం

ప్రభుత్వానికి రుణపడి ఉంటారు



వేట విరామ భృతిని రూ.20వేలకు పెంచటంతో మత్స్యకారులు కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. కావలి మండలంలో 3,269 కుటుం బాలకు పెంచిన భృతి అందనుంది.

- సోమయ్యగారి రమణ, కావలి నియోజకవర్గ మత్స్యకారసంఘం అధ్యక్షుడు

భృతి పెంపు హర్షణీయం



కూటమి ప్రభుత్వం మత్స్యకారులను గుర్తించి వేట విరామ భృతి రూ.20 వేలకు పెంచడం శుభపరిణామం. గతంలో వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వడమేగాక అనేక కొర్రీలతో అర్హులందరికీ భృతి ఇవ్వలేదు. మత్స్యకారులూ నానా ఇబ్బందులు పడ్డారు.

- కొండూరు బాబు, ఇస్కపల్లిపాలెం, అల్లూరు మండలం

ఈ మొండిగోడలకు మోక్షం!

- బీసీ భవన్ నిర్మాణంలో కదలిక
- 2019లో శంకుస్థాపన చేసిన నాటి టీడీపీ సర్కారు
- వైసీపీ హయాంలో పునాదులకే పరిమితం
- బిల్లులివ్వకపోవడంతో కాంట్రాక్టరు పరారీ
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముందడుగు
- కొత్త అంచనాలతో ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌కు ఆదేశం



వైసీపీ హయాంలో వేసిన శిలాఫలకం

నెల్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కొన్ని కులాలకు భవనాలు నిర్మించాలని 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నిర్ణయించారు. ఇందులో భాగంగానే నగరంలోని కొండాయపాలెం గేటు ప్రాంతంలో బీసీ భవన్ నిర్మాణానికి స్థలాన్ని గుర్తించారు. రూ.4.45 కోట్లతో ఈ భవనం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. బీసీ భవన్‌లో శుభకార్యాలు జరుపుకునేందుకు పెద్ద హాల్, కొన్ని గదులను నిర్మించాల్సి ఉంటుంది. అలానే లైబ్రరీ కూడా ఏర్పాటు చేయాలి. బయటతో పోలిస్తే ఇక్కడ బీసీలకు తక్కువ అద్దెకు బుకింగ్‌లు ఇస్తారు. 2019 జనవరి 3వ తేదీన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు బీసీ భవన్ నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పునాదులు తవ్వడం మొదలుపెట్టారు. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచాయి.

● వైసీపీ హయాంలో..

వైసీపీ హయాంలో బీసీ భవన్‌కు గ్రహణం పట్టింది. టీడీపీ ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఆ తర్వాత మళ్లీ ఈ భవనం నిర్మాణానికి రివైజ్డ్ ఎస్టిమేషన్లు వేసి రూ.5.45 కోట్లకు అంచనాలు పెంచారు. 2021 జూన్ 25వ తేదీన మరోసారి బీసీ భవన్‌కు శిలాఫలకం వేశారు. అప్పటికే తవ్విన పునాదుల్లో కాలమ్స్ నిర్మించారు. ఇందుకు రూ.83 లక్షలను ఖర్చు చేశారు. కానీ ఆ తర్వాత ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు నిలిపేశారు. చాలా కాలం పాటు బిల్లులు ఇవ్వకపోవడంతో ఇక తాను పనులు చేయలేనంటూ కాంట్రాక్టర్ పారిపోయారు. దీంతో పూర్తయిన పునాదులు మూడేళ్లుగా పిచ్చి చెట్లతో సహవాసం చేస్తున్నాయి. బీసీ భవన్ పూర్తి చేయాలంటూ గత ప్రభుత్వంలో బీసీ నాయకులు ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇచ్చుకున్నా ఫలితం లేకుండా పోయింది.

● మళ్లీ చిగురిస్తున్న ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ బీసీ భవన్ నిర్మాణంలో ముందడుగు పడింది. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నేతలు బీసీ భవన్‌పై చర్చించారు. వీలైనంత త్వరగా పనులు మొదలు పెట్టి పూర్తి చేయాలని నిర్ణయించారు. ఆ వెంటనే కలెక్టర్ ఆనంద్‌తోపాటు ఇతర అధికారులతో మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశమై బీసీ భవన్ పరిస్థితిపై సమీక్షించారు. ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ కొత్త ఎస్టిమేషన్లు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని మంత్రులు ఆదేశించారు. ప్రస్తుతం అధికారులు కొత్త ఎస్టిమేషన్లు రూపొందించే పనిలో ఉన్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే ప్రభుత్వం నుంచి అనుమతులు తెప్పించి బీసీ భవన్ నిర్మాణాన్ని పునఃప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే ఈ సారైనా ఎటువంటి ఆటంకాలు లేకుండా కాపు భవన్ మాదిరిగా బీసీ భవన్ కూడా పూర్తవుతుందో.. లేదో.. చూడాలి.

భయం గుప్పెట్లో 'కస్తూర్బా' పరిసరాలు

- అంధకారంలో విద్యాలయ ప్రాంతం
- ఆవరణలో కొరవడిన పారిశుధ్యం

కావలి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ముసునూరు శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు భయం గుప్పెట్లో కాలం వెల్లదీస్తున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 260 మంది విద్యార్థినులు చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ నెల 8న ముసుగు ధరించిన ఓ యువకుడు హాస్టల్ వెనుక వైపు గోడదూకి లోనికి ప్రవేశించటంతో విద్యార్థినుల తల్లి దండ్రుల్లో కలవరపాటు మొద లైంది. శివారులోని విద్యాల యం కావడంతో చుట్టూ కంపచెట్లతో పాటు నిరుపయోగంగా ఉన్న జగనన్న ఇళ్లు ఉండటంతో ఆ ప్రాంతం అసాంఘిక కార్యక్రమా లకు అడ్డాగా మారింది. అంతమంది విద్యార్థినులతో ఉన్న విద్యాలయానికి ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ఇందిరమ్మకాలనీ ట్రాన్స్‌ఫార్మర్ కు లైన్ కలపడంతో తరచూ లోవోల్టేజి సమస్య వస్తుందని లైట్లు ఎక్కువ వేసినపుడు ఫీజులు కాలిపోతున్నట్లు తెలిపారు. ఇలాంటి సమస్యలతో బాలికల విద్యాలయంలో రక్షణ కరువైందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాలయం రెండు క్యాంపస్‌లుగా ఉండటంతో రాత్రి సమయంలో విధుల్లో ఉండే ఒకే ఒక మహిళా వాచ్‌మెన్‌కు గస్తీ నిర్వహించటం కష్టతరం అవుతుంది. ఆమెకు తోడు రాత్రి సమయంలో ఇద్దరు టీచింగ్ స్టాఫ్ మాత్రమే విధుల్లో ఉండ టంతో వారందరూ మహిళలు కావటంతో భయంగా ఉంటున్నారు. చుట్టూ ఉన్న ప్రహరీ ఎత్తు పల్లాలుగా ఉండటంతో విద్యార్థినులకు రక్షణ కరువైందని స్థానికులు చెబుతున్నారు.



ఆగంతకుడు ప్రవేశించిన బాలికల విద్యాలయం వెనుక భాగం

40 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



గుడ్లూరు పోలీస్ స్టేషన్‌లో పట్టుబడ్డ బియ్యం వాహనం

గుడ్లూరు, ఫిబ్రవరి 11: ఇతర పట్టణ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న 40బస్తాల రేషన్ బియ్యంను మంగళవారం గుడ్లూరు ఎస్ఐ వెంకట్రావు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాల మేరకు.. లింగసముద్రం మండలం అంగిరేకులపాడులో బొలేరో వాహనంలో లోడు చేసుకుని గుడ్లూరు మండలం పూరేటిపల్లి మీదుగా కావలికి బియ్యం తరలిస్తున్నట్లు సమాచారంతో గుడ్లూరు శివాలయం జంక్షన్ వద్ద వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని 30 అనాథ బాలల సంరక్షణ కేంద్రాలకు ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, జిల్లా ప్రొబేషన్ అధికారి ఖాసిం దొర మంగళవారం అందజేశారు. బాలల న్యాయ చట్టం సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకున్న కేంద్రాలకు సర్టిఫికెట్లు అందించినట్లు సురేష్ తెలిపారు.

ఆ ఐదుగురు.. సమాజసేవకులు

- రోజువారి సంపాదనలో కొంత వినియోగం
- విద్యాసామగ్రి, నిత్యావసరాల పంపిణీ

ముంగమూరు భవాని ఎడ్యుకేషన్ సొసైటీలో అన్నదానం చేస్తున్న మల్యాద్రిగౌడ్, స్నేహితులు



కలిగిరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : తాతలు, తండ్రులు సంపాదించిన ఆస్తిని మరింత పెంచుకుంటూ సేవా కార్యక్రమాలు చేయడం సహజం. అయితే ఏరోజుకారోజు పని చేస్తే తప్ప జీవనం సాగించలేని ఆ ఐదుగురు తమ సంపాదనలో కొంత సేవాకార్యక్రమాలకు వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

● కలిగిరికి చెందిన పీ మాల్యాద్రి గౌడ్ గీత కార్మిక కుటుంబానికి చెందినవారు. చిన్నతనంలో జరిగిన ఓ ప్రమాదంలో కన్ను దెబ్బతినడంతో చదువుకు స్వస్తి చెప్పి కొంతకాలం సైకిల్ షాప్, బడ్డీకొట్టులో పనిచేస్తూ కులవృత్తిలో తండ్రికి సాయపడేవాడు. వివాహం అయ్యాక ఓ హోటల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తాను చదువుకోకపోవడం, తమ చిన్నారులను చదివించ డానికి పేద తల్లిదండ్రులు పడే ఇబ్బందులు కళ్లారా చూడటం మాల్యాద్రిగౌడ్‌ను తీవ్రంగా కలచివేశాయి. దీంతో చిన్నారుల చదువులకు చేతనైన సాయం చేయాలన్న ఉద్దేశంతో బట్టలు, పుస్తకాలు, ఉపకరణాలు అందిస్తున్నారు. కొంతకాలం మల్యాద్రి గౌడ్ ఒక్కరే సాయం చేస్తూ ఉండటం గమనించి స్థానికంగా ఉన్న మరో నలుగురు షేక్ జిలానీబాషా, షేక్ గౌస్‌పీర్, షేక్ మస్తాన్, తంగేడుపల్లి మహేష్ కూడా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

మాల్యాద్రి గౌడ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు గౌడ సంఘం నాయకులు గుర్తించి జైగౌడ ఉద్యమం ద్వారా మరిన్ని సేవాకార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చి ఉదయగిరి నియోజకవర్గ జైగౌడ ఉద్యమం సంఘం అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఓ వైపు స్నేహితుల అండదండలు, మరో వైపు గౌడసంఘం సహకారంతో తన సేవా కార్యక్రమాలను దూర ప్రాంతాలకూ విస్తరించారు.

● ప్రతి ఏడాది పాఠశాలల ప్రారంభ సమయంలో పేద విద్యార్థులకు ఉపకరణాలు అందించడం, ఎస్టీ కాలనీవాసుల కు చలికాలంలో దుప్పట్లు అందజేయ డం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన ప్పుడు బియ్యం, పప్పులు, దుస్తులు అందజేస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు బట్టలు అందించడం, వేసవిలో మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు, అనారోగ్యానికిగురై కుటుంబ ఆర్థికపరిస్థితి బాగా లేని వారికి నగదుసాయం చేయడం, రోడ్డు ప్రమా దాల్లో గాయపడినవారికి అవసరమైన సహాయం అందించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాల స్ఫూర్తితో మరికొందరు పేదలకు సహాయపడితే అదే తమకు సంతోషాన్ని కలిగించే విషయమని ఆ ఐదుగురు స్నేహితులు చెప్పడం వారి సేవాభావానికి నిదర్శనం.



నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తూ..

న్యూస్ బాక్స్

మేదర, కుమ్మర్లు రుణాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బీసీలలోని మేదర, కుమ్మర శాలివాహన కులాలకు చెందిన వారు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి వెదురు బుట్టల తయారీ, కుండల తయారీకి రుణాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. జిల్లాలో 100 యూనిట్లకు రూ.3 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. యూనిట్ విలువ రూ.3లక్షలని అందులో 50 శాతం సబ్సిడీ, మిగిలిన 50 శాతం బ్యాంకు రుణం లభిస్తాయని వివరించారు. మూడు నుంచి ఐదు మంది సభ్యులు బృందంగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు ఆధార్, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీ కరణ, కుల నిర్ధారణ సర్టిఫికెట్లతో ఏపీవోబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని కోరారు.

ప్రాక్టికల్స్‌కు 8,323 మంది హాజరు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు జరుగుతున్న ప్రయోగ పరీక్షలకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా 8,323 మంది హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 4,802 మందికి 4,136 మంది హాజరుకాగా 144 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 4,267 మందికి 4,187 మంది హాజరుకాగా 80 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు నరసింహకొండ, అరవిందనగర్‌లోని నాలుగు నారాయణ కళాశాలలను, బుచ్చిలోని సిద్ధార్థ, గుత్తికొండ శ్రీరాములు కళాశాలల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. డీవీఈవో నాలుగు, డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ కలిపి 15 కేంద్రాలను పరిశీలించాయి.

హాల్‌టికెట్లు ఇప్పించండి : ఎస్ఎఫ్ఐ

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కొన్ని ప్రైవేట్ కళాశాలలు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని, వారిపై చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరు ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులుకు మంగళవారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీ నరేంద్ర, విక్రమ్, మహీర్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

మర్రిపాడ : నెల్లూరు- ముంబాయి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. సన్నవారిపల్లికి చెందిన సానా శివకుమార్ రెడ్డి(16) కొంతకా లంగా మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లోని కూరగాయల అంగడిలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి అంగడి మూసేసి యజమాని సుబ్బారెడ్డితో కలిసి బైక్‌పై చెత్త పడేసేందుకు వెళ్లాడు. రోడ్డు దాటుతుండంగా కడప నుంచి నెల్లూరు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో శివకుమార్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సుబ్బారెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడు చిన్నవయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి అమ్మమ్మ వద్ద ఉంటూ కూరగాయల అంగడిలో పనిచేస్తున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

బాలికపై అత్యాచారయత్నం

● స్థానికుల దేహశుద్ధి

కావలి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిదేళ్ల బాలికపై ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం కావలిలోని అరుంధతీయవాడలో జరిగింది. ఇంటిలోని పైపోర్షన్‌లో బాలిక ఒంటరిగా ఉండటాన్ని గుర్తించిన గుండెమడకల రమేష్ (45) తన ఇంటిలోకి పిలిచాడు. ఇంటిలోకి వచ్చిన బాలికపై రమేష్ అత్యాచారయత్నానికి పాల్పడటంతో ఆమె బిగ్గరగా కేకలు వేసింది. దీంతో స్థానికులు ఇంట్లోకి చొరబడి రమేష్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. 1వ పట్టణ ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8726
వెండి కిలో ధర	రూ. 97,300
వెండి ఒక గ్రాము	రూ.100.30

ఎంఐజీ లేఅవుట్లకు స్థలాలు గుర్తించండి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి): నుడా పరిధిలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఐజీ లేఅవుట్ల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి, ఆయన ఆర్డీవోలు, తహసీల్దార్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడు తూ జాతీయ రహదారికి దగ్గరగా, నివాసానికి ఆమోదయోగ్యమైన స్థలాలను గుర్తించాలని సూచించారు. వారంలోగా నివేదిక ఇవ్వాలన్నారు. నుడా చైర్మన్ విజ్ఞప్తి మేరకు జిల్లాలోని అనధికార లేఅవుట్ల గుర్తింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కోటంరెడ్డి మాట్లాడు తూ మంత్రి నారాయణ ఆదేశాలతో నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీకి రూ.15 కోట్లు, తాగునీటి పైపులైన్లకు రూ.6కోట్లు నుడా నిధులు కేటాయించి నట్లు చెప్పారు. ఎంఐజీ లేఅవుట్లు ఏర్పాటు చేసి పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించి తక్కువ ధరకే స్థలాలు ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో నుడా వైస్ చైర్మన్ సూర్యతేజ, జేసీ కార్తీక్, ఆర్డీవో నాగ సంతోష్ అనూష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంగం పాత ఆనకట్ట వద్ద కనిగిరి ప్రధాన కాలువ వంతెన పక్కన పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్ శిథిలమైంది.ఒక పక్క వంతెనపై వాహనాలు వచ్చినప్పుడు మరోవైపు రాకపోకలు సాగించే పాదచారులకు ఇబ్బందిగా మారింది. దీంతో గతంలో ప్రభుత్వం వంతెన పక్కన ఐరన్ షీట్‌లతో ఫుట్‌పాత్ ఏర్పాటు చేశారు. ఈ ఫుట్‌పాత్ మీటరు వెడల్పున 50 మీటర్ల పొడవు ఉంది. వంతెనకు తూర్పు వైపు ఉన్న దళితకాలనీ వాసులు ఈ ఫుట్‌పాత్‌పైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఐరన్ సీట్‌లు వానకు తడిచి, ఎండకు ఎండి తుప్పు పట్టి, ప్రమాదకరంగా మారాయి. దీంతో అధికారులు ఫుట్‌పాత్ ప్రవేశం వద్ద కంప వేసి మూసివేశారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌ను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

-సంగం, (ఆంధ్రజ్యోతి)

ఫుట్‌పాత్ శిథిలం.. రాకపోకలకు అంతరాయం!



ఫుట్‌పాత్‌కు ప్రవేశం వద్ద వేసిన కంప

వరిని ముంచిన వాతావరణం

● పిలక దశలో వెన్నులు ● దిగుబడిపై తీవ్ర ప్రభావం

● ధాన్యం ధర పతనంతో రైతుల ఆందోళన

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రబీలో వరి సాగు చేపట్టిన రైతాంగాన్ని వాతావరణం నిండా ముంచేసింది. సాగు ఆరంభం నుంచే వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతోపాటు మంచుతో నేల బిగుసుకుపోయి పైరులో ఎదుగు, బొదుగు లేక పిలకలు పెట్టాల్సిన సమయంలో వెన్నులు, వెన్నులు తీసే సమయంలో పిలకలు పెట్టడంతో ధాన్యం దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఈ సీజన్‌లో జిల్లాలో ఎక్కువగా కేఎన్ఎం 1638, బీపీటీ, ఆర్ఎన్ఆర్ 733 (షుగర్‌లెస్) తదితర వరి రకాలను రైతులు సుమారు 4 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. బుచ్చి మండలంలోనే 9 వేల ఎకరాల్లో సాగు చేశారు. వాతావరణం అనుకూలించకపోవడం ఒక కారణమైతే వరి సాగుకు అదునుబట్టి శీతల వాతావరణానికి అనుకూలమైన



దామరమడుగులో కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు

విత్తనాల ఎంపిక, యాజమాన్య పద్ధతులపై సరైన సలహాలు, సూచనలు లేకపోవడంతో అధిక పెట్టుబడులు పెట్టి ఎరువులు, రసాయనిక మందులు ఇష్టానుసారం వాడేశారు. దీంతో వరి పైరు మరో నెల రోజులకు తీయాల్సిన వెన్నులు నెలకు ముందుగానే చిట్టి వెన్నులు తీసింది. ఈ క్రమంలో ఇటీవల కాళయకాగొల్లు, పెనుబల్లి గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు వరిసాగును పరిశీలించారు. వాతావరణం అనుకూలం లేకపోవడమే ఇందుకు కారణం అని గుర్తించి చెప్పినా రైతులు వ్యతిరేకించారు. యేటా ఇదే సీజన్‌లో పంటలు సాగు చేస్తామని, ఎప్పుడూ లేనిది ఈ ఏడాదే ఎందుకు జరి గిందని ఎదురు ప్రశ్నించారు. కాగా ప్రభు త్వం సరఫరా చేసిన విత్తనాలు బస్తాల్లోనే మొల కెత్తినా ఆ విత్తనాలనే సాగు చేసి దెబ్బతిన్నామని రెడ్డిపాళెం రైతులు వాపోయారు.



పిలక దశలో వెన్ను తీసిన పైరును చూపిస్తున్న రైతు మునగాల ఈశ్వరయ్య

● దిగజారిన ధాన్యం ధర

జిల్లాలో మొదట బుచ్చి మండలంలోనే వరి కోతలు మొదలయ్యాయి. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర క్వింటంకు రూ.2320 నిర్ణయించగా పుట్టికి రూ.19,720లకు మిల్లర్లు కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే మిల్లర్లు, దళారులు కుమ్మక్కై కేవలం రూ.15 వేల నుంచి 16వేలకే కొనుగోలు చేస్తుండటంతో రైతాంగం నష్టపోతోంది. దిగుబడి తగ్గి రైతాంగం సతమతమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ మద్ద తు ధర ప్రకారం మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయకపోతే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని రైతాంగం కోరుతోంది.

దిగుబడి తగ్గింది

ఈ రబీలో వరి నాట్లు వేసి నెల రోజులైనా పైరు ఎదగకుండానే చిట్టి వెన్నులు తీసి దిగుబడి తగ్గుముఖం పట్టింది. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎలాంటి సూచనలు, సలహాలు ఇవ్వకపోవడంతో నష్టపోయాం. కాగా ఇటీవల 10 రోజులుగా కాస్తున్న ఎండలకు నేల కొంత బిగువును వదిలేయడంతో వెనుక చిక్కి వేసిన వరికి అనుకూలిస్తోంది. ప్రభుత్వం సరఫరా చేసిన విత్తనాలతో తీవ్రంగా నష్టపోయాం.

- మునగాల ఈశ్వరయ్య, కాళయకాగొల్లు

వెన్నుకు మెడ విరుపు తెగులు

వరి పంట చేతికొచ్చే సమయంలో వెన్నుకు మెడవిరు పు తెగులు పడింది. మెడవిరుపు పోయేందుకు పీజీ-1 రసాయనిక మందులు పిచికారి చేస్తున్నాము. ఈసారి వాతావరణం అనుకూలించకపోవడంతో పంట దిగుబడి బాగా తగ్గిపోయింది. పెట్టుబడులు అధిక మయ్యాయి.

- చింతలపల్లి వెంకురెడ్డి, పెనుబల్లి

బైండోవర్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా ఉన్న, నేరాలకు పాల్పడే అవకాశమున్న వ్యక్తులను నెల్లూరు చిన్నబజారు స్టేషన్ పోలీసులు బైండోవర్ చేశారు. ఆ స్టేషన్ ఎస్ఐ సీవీ సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో మంగళవారం గాంధీబొమ్మ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించారు. అనుమా నాస్పదంగా తిరుగుతున్న కుసుమ హరిజన వాడకు చెందిన ఎం మల్లి, బీ కన్నయ్య, మూలాపేట రాజీవ్ గృహకల్పకు చెందిన షేక్ సిద్దిఖ్, షేక్ కరిముల్లా, షేక్ ఆషిద్, షేక్ షాహీదాను అదుపులోకి తీసుకున్నారు. వారిని స్థానిక తాహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు.

అత్యాచార నిందితుల అరెస్ట్

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి11, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని నవలాకుల తోట వద్ద ఏడో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ కేసులో ముగ్గురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ గుంజి వేణు తెలిపారు. బాలికపై అత్యాచారం చేసిన నరుకూరు హరిజనవాడకు చెందిన నంబూరు సతీష్ ఏ-1, అతనికి సహకరించిన కోవూరు సునీల్ ఏ-2, గోగానపల్లి సునీల్ ఏ-3గా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయాధికారి ఈ నెల 22వరకు రిమాండ్ విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

దివ్యాంగ పిల్లలకు వైద్య సేవలు

● సీనియర్ సివిల్ న్యాయాధికారి వాణి ● ఇంటింటికి తిరిగి పరిశీలన



ఇంటింటి పరిశీలనలో న్యాయాధికారి వాణి, ఎన్జీవో, పారా లీగల్ వలంటీర్లు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు ఆదేశాల మేరకు దివ్యాంగ బాలలను గుర్తించి వారికి అన్ని విధాలా వైద్య చికిత్సలు అందేలా కృషి చేస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి కే వాణి వెల్లడించారు. నెల్లూరులోని డైకస్ రోడ్డు వద్ద మంగళవారం ఇంటింటికి తిరిగి దివ్యాంగుల పరిస్థితిని తెలుసుకున్నారు. దివ్యాం గులను జీజీహెచ్ ప్రాంగణంలోని బాలభవిత కేంద్రానికి తీసుకు వెళితే అత్యుత్తమ వైద్య చికిత్సలు అందిస్తారని తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు వైద్య బృందం గ్రామాల్లో పర్యటించి దివ్యాంగులను గుర్తిస్తోంద ని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో శ్రీనివాసరావు, ఏఎస్ఐ సతీష్‌బాబు, పారాలీగల్ వలంటీర్ శ్రీనివాసులు, సురేంద్ర పాల్గొన్నారు.

ఆనాటి.... ఆ తీపి జ్ఞాపకాలలో..!

● కావలి జేబీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ● 55 ఏళ్ల నాటి విద్యార్థుల కలయిక



జవహర్ భారతి కళాశాల పూర్వ విద్యార్థులు

వాళ్లందరి వయసు 70 పైమాటే!. డాక్టర్లు, ఇంజనీర్లు, అధికారులుగా పనిచేశారు. మనుమలు, ముని మనుమళ్లను కలిగి ఉన్నారు. అలాంటి వారంతా ఒక్కసారి కాలేజీ రోజుల్లోకి వెళ్లిపోయారు. నాటి అల్లరిని, అయ్యవార్లను గుర్తు చేసుకున్నారు. కష్టసుఖాలను పరస్పరం పంచుకున్నారు. కొందరైతే 55 ఏళ్ల తర్వాత స్నేహితులను చూసి ఉద్వేగ్నుల య్యారు.

కావలిలోని జవహర్ భారతి కళాశాలలో 1966 - 69 సంవత్సరాల్లో డిగ్రీ చదువుకున్న విద్యార్థుల అపూర్వ కలయిక మంగళవారం నెల్లూరులోని టౌన్‌హాల్ రీడింగ్ రూమ్‌లో సందడిగా జరిగింది. ఆ బ్యాచ్‌లో చదువుకున్న ఎంతో మంది అధికారులుగా, విద్యావేత్తలుగా, వృత్తి నిపుణులుగా ఉన్నత స్థానాలకు ఎదిగారు. నాటి విద్యార్థుల్లో ఒకరైన శ్రీరామ్ మాల్యాద్రి ఐఆర్ ఎస్ అధికారిగా, బాపట్ల ఎంపీగా పని చేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన జూపూడి ప్రభాకర్‌రావు రాజకీయాల్లో ఉన్నారు. వీరంతా విశ్రాంత సోషల్ వెల్ఫేర్ అధికారి ఖాసిం, సీహెచ్ భాస్కర్‌రెడ్డి, హనుమంతరావు నాయుడు, నిరంజన్‌రెడ్డి, శారద తదితరులతో కలిసి జవహర్ భారతి కళాశాల పూర్వ విద్యా ర్థుల కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ ఆధ్వ ర్యంలో ఈ సమ్మేళ నం జరిగింది. 150 మంది పూర్వ విద్యార్థులు కలిసి నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. జవహర్ భారతి కళాశాలల వ్యవ స్థాపకుడు విశ్వోద య కళాశాల రెక్టార్ దొడ్ల రామచంద్రారెడ్డి సహకారాన్ని, దాతృత్వాన్ని కొని యాడారు. జేబీ కళాశాల విద్యార్థుల్లో ప్రతిభ చూపిన పది మంది పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున ఆర్థిక సాయం అందించాలని తీర్మానించారు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

మైనింగ్ డాన్‌లను కట్టడి చేస్తా : ఎమ్మెల్యే కురుగొండ్ల

సైదాపురం, (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలోని మైనింగ్ డాన్‌లను కట్టడి చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని మొలకలపూండ్ల గ్రామం గద్ద తిప్ప వద్ద పేదలు సాగు చేసుకుంటున్న భూములను మంగళవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెన్నై, బెంగళూరు, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఆన్‌లైన్ ద్వారా మైనింగ్ లీజుల అనుమతి కోసం దరఖాస్తు చేస్తుంటే ఇక్కడి అధికారులు ఎన్‌వోసీలు ఇస్తున్నారని పేర్కొన్నారు. గద్దల తిప్ప వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీలు సాగు చేసుకుంటున్న భూములకు మైనింగ్ అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. కొందరు ఎన్‌వోసీలు తీసుకొచ్చి పేదలు సాగు చేసుకుంటున్న భూములను ఖాళీ చేయాలని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆయన చెప్పారు బడాబాబులు రకరకాలుగా పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాదారు పాస్‌బుక్కులు ఇప్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని కురుగొండ్ల పేర్కొన్నారు.



రహదారిపై ఆందోళన చేస్తున్న బాధితులు

ఇళ్లు, దుకాణాలు తొలగిస్తే

ఆత్మహత్యలే శరణ్యం

● రోడ్డుపై బైఠాయించి బాధితుల ఆందోళన

విడవలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తమ ఇళ్లు, దుకాణాలు తొలగిస్తే ఆత్మహత్యలే శరణ్యమని విడవలూరులో రహదారి మార్జిన్ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం బాధితులు రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ ఆర్అండ్‌బీ స్థలాలను ఆక్రమించుకుని ఇళ్లు, దుకాణాలు నిర్మించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు గుర్తుతెలియని వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేయడం, లోకాయుక్త ఆదేశాల మేరకు అధికారులు తూతూ మంత్రంగా సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న తమకు ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు ఉన్నాయని, వాటిని పరిశీలించకుండానే వాటిని తొలగించి మా పొట్టకొట్టడం ఎంతవరకు న్యాయమని మండిపడ్డారు. జిల్లా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగింపును తాత్కాలికంగా వాయిదా వేసి సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దాలని కోరారు.

ఏఎన్ఎంల మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : సచివాలయం ఏఎన్ ఎంల ఉద్యోగోన్నతికి సంబంధించి మెరిట్ జాబితా అందుబాటులో ఉంచిన ట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. ఈ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 14లోపు డీఎంహెచ్‌వో కార్యాలయం పనిదినాల్లో తెలియచేయాలన్నారు.

సౌర విద్యుత్‌తో కరెంటు బిల్లుల తగ్గింపు

● ఎస్ఈ విజయన్



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరు సౌర విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ కోరారు. నెల్లూరులోని స్టోన్‌హౌస్ పేట సబ్‌స్టేషన్‌లో మంగళవారం సూర్య ఘర్ పథకంపై వినియోగదారుల కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాటాడుతూ రాబోవు వేసవిలో మెరుగైన విద్యుత్ ఇవ్వడానికి సోలార్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 25 ఏళ్ల గ్యారెంటీతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తారన్నారు. 1 కిలో వాట్ సోలార్ విద్యుత్ కావాల్సిన వారు రూ. 70వేల నుంచి రూ.80వేల వరకు, 2 కిలోవాట్లకు రూ.1.35లక్షల నుంచి రూ. 1.40 లక్షలు, 3 కిలో వాట్లకు రూ.2.10 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఇందులో రూ.30వేల నుంచి 78వేల వరకు కేంద్ర ప్రభు త్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. బ్యాంకు రుణాలు కూడా లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ బాలచంద్ర, డీఈఈ సునీల్, ఏఈ. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పండ్ల వ్యాపారి మృతి



మృతి చెందిన ఉప్పు శ్రీనివాసులు

మనుబోలు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పండ్లు కొనుగోలు చేసేందుకు వెళుతున్న పండ్ల వ్యాపారి ఉప్పు శ్రీనివాసులు (35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మడమనూరుకు చెందిన ఉప్పు శ్రీనువాసులు నెల్లూరులో పండ్లు, కూరగాయలు కొనుగోలు చేసి ఆటోలో పెట్టుకుని ఊరూరా తిరుగుతూ విక్రయించుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుంచి ఆటో తీసుకుని నెల్లూరుకు బయలుదేరాడు. మండల పరిధిలోని కాగితాలపూరు క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై వెనుక వేగంగా వస్తున్న కారు ముందు వెళుతున్న ఆటోను పొగమంచులో గుర్తించక వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లి చెట్టును ఢీకొట్టుకుని బోల్తా పడింది. దీంతో శ్రీనివాసులు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాకేష్ తెలిపారు.

కూరగాయల విక్రయానికి
అద్దె చెల్లించాల్సిందే!

- ఈ-క్రాప్ సర్టిఫికెట్ తప్పనిసరి
- లేకుంటే నెలకు రూ.3వేల కిరాయి
- కూరగాయలు పండించే రైతులకు ఉచితం
- వ్యాపారుల వద్ద విభేదాలు

కావలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుబజారులో కూరగాయలు విక్రయించే రైతుల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. గతంలో కార్డులు పొందిన రైతులందరూ మహిళలతో సహా ఉచితంగా రైతుబజారులో కూరగాయలు విక్రయించుకునే వారు. కొందరు రైతులు దుకాణాల్లో ఉదయం నుంచి రాత్రివరకు కూరగాయలు అమ్ముకుంటారు.

● ఈ-క్రాప్ వచ్చిన తర్వాత..

మార్కెట్ ఆవరణలోని ముందుభాగంలో నేలపైనే కూర్చుని మహిళలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూరగాయలు అమ్ముకుంటారు. అయితే ఇప్పుడు ఈ-క్రాప్ వచ్చిన తర్వాత కూరగాయలు విక్రయించే రైతులందరూ కూరగాయలు సాగు చేసినట్లు ఈ-క్రాప్ సర్టిఫికెట్లు తేవాల్సి రావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత రైతులు పెద్దగా కూరగాయలు సాగు చేయకపోవటంతో దుకాణాల్లోని రైతులు మార్కెటింగ్‌శాఖకు ప్రతినెలా ఒక్కోదుకాణానికి



రైతుబజారు ఆవరణలో కూరగాయలు విక్రయిస్తున్న మహిళలు

రూ.2,500లు అద్దె చెల్లిస్తున్నారు.

● ఆకుకూరలు అమ్మేవారికి ఉచితం

అయితే మార్కెట్ ఆవరణలో ముందు భాగాన కేవలం ఆకుకూరలు విక్రయించే వారికే ఉచితంగా అమ్ముకునే అవకాశం ఉంది. అయితే మద్దూరుపాడుకు చెందిన మహిళలు స్థానికంగా హోల్‌సేల్‌గా కూరగాయలు కొనుక్కొని రైతుబజారు ఆవరణలో నేలపై కూర్చుని కుప్పలు పెట్టి అమ్ముకుంటున్నారు. అయితే దుకాణాలలో వ్యాపారాలు చేసుకునే రైతులు తాము అద్దెలు చెల్లిస్తున్నామని వారు ఉచితంగా ముందుభాగాన కూర్చుని విక్రయిస్తుండటంతో తమ వద్దకు కొనుగోలు దారులు రావటంలేదని వారు మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతుబజారు ఎస్టేట్ ఆఫీసరు నేలపై కూర్చుని కూరగాయలు అమ్మే మహిళలను కూడా మీరు కూరగాయలు సాగుచేసినట్లు ఈ- క్రాప్ ద్వారా సర్టిఫికెట్లు తేవాలని లేకపోతే నెలకు రూ.3వేలు అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అద్దె చెల్లిం చకపోతే ఇక్కడ విక్రయాలు జరుపవద్దని చెప్పటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దె చెల్లించాలట



నేలపై కూర్చుని మండు టెండలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూరగాయలు అమ్ముతుంటా. నాకు అధికారులు నెలకు రూ.3వేలు చెల్లించమని అడుగుతున్నారు. చెల్లించకపోతే విక్రయాలకు అనుమతి ఇవ్వమం టున్నారు.

- ఆళ్ల సుశీలమ్మ

రైతు కార్డు ఉన్నా ఇబ్బంది పెడుతున్నారు



కూరగాయలు విక్రయించుకునేలా రైతుకార్డు ఉన్నా ఇబ్బంది పెడుతున్నారు. ఎంతో కాలం నుంచి ఇక్కడ అ మ్ముకుంటున్నాం. ఇప్పుడు కూరగాయల సాగు లేనందున ఈ-క్రాప్ సర్టిఫికెట్ లేకపోతే డబ్బులు కట్టాలంటున్నారు. నేలపై కూర్చుని విక్రయించుకునే వారికి అద్దె ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో న్యాయం చేయాలి.

- కొండా సుశీలమ్మ

న్యూస్ బాక్స్

సీఆర్‌ఎంటీకి సన్మానం

లింగసముద్రం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పెదపవని క్లస్టర్ పరిధిలోని రిజర్వ్ మొబైల్ టీచర్ పాదర్తి పురుషోత్తంను మంగళవారం హెచ్‌ఎం శ్రీనివాసులు పెదపవని హైస్కూల్ ప్రాంగణంలో పూలమాల, శాలువాతో సన్మానించారు. గత నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా డీఈఓ, ఏపీసీల చేతుల మీదుగా జిల్లా ఉత్తమ సీఆర్‌ఎంటీగా అవార్డు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అల్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాలకు బుధవారంతో దరఖాస్తు చేసుకునే గడువు ముగియనుందని స్థానిక నగర పంచాయతీ కమిషనరు ఉమామహేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూయస్, కాపు కులాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు సబ్సిడీ రుణాలను దరఖాస్తు చేసుకోవాలని సూచించినందున అర్హులు కుల, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ కార్డుల ఆధారంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డిపాలెం కొత్తూరులో వెలసిన పోలేరమ్మకు మంగళవారం భక్తులు పొంగళ్లు నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారిని గజమాలతో అలంకరించి పులి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కాయాకర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించారు.

మద్దతు ధర కల్పించాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పొగాకు, మిర్చి, వరి పంటలకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు మంగళవారం తహసీల్దార్ అబ్దుల్‌అమీద్‌కు మగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాదాల రమణయ్య, కుమార్, దార్ల మాధవరావు, మానికొండ రమణయ్య, పిల్లి రామచంద్రారెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సాయం

ఉదయగిరి, ఫిబ్రవరి 11: గండిపాళెంలో మృతిచెందిన వేణు అంత్యక్రియలకు మండల వైస్, జీఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.10వేలు, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య రూ.5వేలను కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. భవిష్యత్తులో కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

అధ్యాపకుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కందుకూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకుడిగా పనిచేస్తూ మృతిచెందిన సీ హెచ్ భాస్కరరావు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షలు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసింది. మంగళవారం ఈ చెక్కును ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలి మృతుడి భార్య వరలక్ష్మికి అందజేశారు. ప్రభుత్వ మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే ఇంటూరి, ఆర్‌జేడీ వీవీ సుబ్బారావు, నెల్లూరు డీవీఈఓ మధుబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.



చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలి

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 15న కందుకూరు విచ్చేస్తున్న సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వివిధ శాఖల అధికారులతో పరిశీలించి సూచనలిచ్చారు. ఏర్పాట్ల పరిశీలనకు బుధవారం కలెక్టరు, ఎస్పీలు రానున్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

కావలి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై యువత అవగాహనతో ఉండాలని మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ సుందర్‌రావు తెలిపారు. స్థానిక సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీబాయ్, రెండో పట్టణ ఎస్‌ఐ గౌస్‌భాష పాల్గొన్నారు.

ప్రారంభ దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలి

ఏఎస్‌పేట, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో మంగళవారం డీపీఎంవో మోహన్‌రావు లెప్రసీ పక్షోత్సవాల సందర్భంగా విద్యార్థులకు కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు. లెప్రసీ, క్యాన్సర్, హెచ్‌ఐవీ వ్యాధులపై కౌమరదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి అశ్వవాహన సేవ



కావలి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హనుమత్ క్షేత్రంలో వెలసిన లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి మంగళవారం అశ్వవాహనం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయాణాచార్యులు పర్యవేక్షణలో మున్సిపల్ ప్లాట్స్ బాపూజీ నగర్ మీదుగా గ్రామోత్సవం సాగింది. ఉదయం తోమల సేవ, హోమం పూజలు, స్వామి వ్రతమహోత్సవం చేపట్టారు. బుధవారం చక్రస్నానం, ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు అర్చకులు సూర్యనారాయణాచార్యులు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

సీతారామపురం,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):బసినేనిపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో సుభాషిణి మంగళవారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేసి, కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పనులు చేపట్టి పూర్తిస్థాయిలో రూ.300 వేతనం పొందాలని, ప్రతిరోజూ కనీసం నాలుగు గంటలు పనిచేస్తే గరిష్ఠ కూలి డబ్బులు వస్తాయన్నారు. సమయపాలన పాటించి పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఉదయగిరి : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం వెంగళరావునగర్ జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

కోల్డ్ స్టోరేజీలో నిల్వకు అనుమతి తప్పనిసరి

కందుకూరు : పొగాకు రైతులు పొగాకును కోల్డ్ స్టోరేజిలలో నిల్వ చేయాలంటే బోర్డు అధికారుల నుంచి అనుమతి తప్పకుండా తీసుకోవాలని కందుకూరు 1, 2 వేలం నిర్వహణాధికారులు చంద్రశేఖర్, కిరణ్ తెలిపారు.

ముళ్లచెట్ల తొలగింపు

ఉదయగిరి, ఫిబ్రవరి 11: పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద వాహన రాకపోకలకు అడ్డంకిగా మారిన ముళ్లచెట్లను ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఎక్స్‌కవేటర్‌తో మంగళవారం తొలగింపు చర్యలు చేపట్టారు. ప్రమాదాల నివారణకు ముళ్లచెట్లను తొలగించడంతో పాటు వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. .

గర్భిణులకు టీకాలు వేయించండి

కావలి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణిలు, పురిటి బిడ్డలను గుర్తించి సకాలంలో టీకాలు వేయించాలని వ్యాక్సినేషన్ జిల్లా అధికారి ఉమామహేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక ఏరియా వైద్యశాల ప్రాంగణంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఇంటింటి సర్వే చేపట్టి గర్భవతులు, పురిటి బిడ్డలను గుర్తించి వారికి తగిన సమయంలో వ్యాక్సిన్లు వేయాలన్నారు. వ్యాక్సినేషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సకాలంలో వ్యాక్సినేషన్ చేయడం వలన అనేక ప్రమాదాలు, వైకల్యం నుంచి బయటపడవచ్చని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత, అర్బన్ మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రేపు వైద్య, రక్తదాన శిబిరం

ఉలవపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ యూనియన్-1104 స్థాపించి 75ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఒంగోలు యూనియన్ కార్యాలయ ఆవరణంలో ఈ నెల 12న ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు కందుకూరు డివిజన్ అధ్యక్ష, కార్య దర్శులు నాగయ్య, మనోహర్‌లు ప్రకటనలో తెలిపారు.

మహా కుంభాభిషేకం

కలువాయి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుల్లూరులో కొత్తగా నిర్మించిన వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విగ్రహ పునఃప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా మహాగణపతిపూజ, పుణ్యాహవ చనం, పంచగవ్యారాధన సంప్రోక్షణ, అఖండస్థాపన, వాస్తుశాంతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, మూలమంత్ర హోమం, తీర్థప్రసాద వితరణ జరిగాయి. కార్యక్రమాల్లో కర్ణాటక మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు అరవింద్ లింబావలి, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, వడ్డెర కమ్యూనిటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జయశంకర్, ఆలయ సేవాట్రస్ట్ చైర్మన్ చల్లా సీతారాము, గ్రామస్థులు పాల్గొన్నారు.



అరవింద్ లింబావలిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం

తరగతుల విలీనం వద్దంటూ ఆందోళన



అనంతసాగరం: ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు



కలువాయి : నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అనంతసాగరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మినగల్లు ఎస్సీ ప్రాథమిక పాఠశాలను ఫౌండేషన్ పాఠశాలగా విలీనం చేసే విధానాన్ని రద్దు చేయాలని విద్యార్థులు,వారి తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన చేపట్టారు. విలీనం ఆపకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ శాంతి, సుబ్బారాయుడు, శంకరయ్య పాల్గొన్నారు. అలాగే అనంతసాగరం ఉర్దూ పాఠశాల వద్ద విలీనంపై ఆందోళన చేశారు. తమ విద్యార్థులను మోడల్ స్కూల్‌కు పంపించేలా తీసుకుంటున్న చర్యలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

● ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): గండిపాళెం దళితవాడ, గుడినరవ ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5వ తరగతులను గండిపాళెం మెయిన్, సున్నంవారిచింతల పాఠశాలల్లో విలీనం చేయవద్దని పీఎంసీ కమిటీసభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో-2 శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు.

● కలువాయి, (ఆంధ్రజ్యోతి): పెన్నబద్వేలిలోని ప్రాథమికోన్నత పాఠశాలను మార్పు చేయవద్దని రెండోరోజు ఆందోళనలు కొనసాగాయి. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద కూడా విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. పాఠశాల గేటు ముందు నిలుచుని నినాదాలు చేశారు. ఈ ఆందోళనకు విద్యాశాఖ ఉన్నాతాధికారులు స్పందించారు. ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో బాలాజీరావు పాఠశాల హెచ్‌ఎం వీ.కృష్ణారెడ్డి, మాజీ సర్పంచు వింజం బాబూరావు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులను నెల్లూరులోని డీఈవో కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారు. సమస్యపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

గుర్తింపు కార్డులు ఉంటేనే పథకాలకు అర్హులు



కొండాపురం: మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి షేక్‌సైదా

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రత్యేక గుర్తింపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. చుండి, గరుకుపాలెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో పాల్గొని మాట్లాడారు. భూమి కలిగిన ప్రతిరైతుకు గుర్తింపు సంఖ్య ఇవ్వడంతో వ్యవసాయ సేవలను సులభతరం అవుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలు పంటల బీమా, రుణాలపై వడ్డీ రాయితీ వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సీహెచ్ రవీంద్ర పాల్గొన్నారు.

● కొండాపురం: ప్రతిరైతుకు 11అంకెల యూనిక్ ఐడీ తప్పనిసరని మండల వ్యవసాయ అధికారి షేక్ సైదా తెలిపారు. పొలంపిలుస్తోందిలో భాగంగా వెలిగండ్ల, మర్రిగుంటలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులు మాట్లాడారు. 1-బీ లేదా పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, లింకైన ఫోన్ నెంబరును తీసుకొని రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలను కలిసి 11అంకెల యూనిక్ ఐడీ నెంబరును పొందాలన్నారు. ఈ నెంబరుతో ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు.

● ఉలవపాడు: ప్రభుత్వ పథకాలకు అర్హత పొందాలంటే ఇకపై రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి తిరుమల జ్యోతి రైతులకు సూచించారు. మంగళవారం వీరేపల్లిలో నిర్వహించిన పొలంపిలుస్తోందిలో ఆయన పాల్గొని పలు సలహాలు ఇచ్చారు.

● ఉదయగిరి: భూమి ఉన్న ప్రతీ రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా గండిపాళెం, గుడినరవ గ్రామాల్లో రైతులకు అవగాహన నిర్వహించారు. పొలం పత్రాలతో రైతులు ఆయా ఆర్‌ఎస్‌కేలకు వెళ్లి 11అంకెల విశిష్ట సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం సాగులో ఉన్న పైర్లను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.

ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు మార్చి నెలాఖరుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ ఈఈ ఎంవీ మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం గండిపాళెంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సూచనలిచ్చారు. అనంతరం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఏఈలు, వర్కు ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నిర్మించేవి, లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకుంటున్న ఇళ్లను మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. లేకుంటే రద్దయ్యే అవకాశముందన్నారు. ఏప్రిల్ నుంచి ఆప్షన్-2.0 అమల్లోకి వస్తుందన్నారు. అనంతరం గోదాముల్లో నిల్వ ఉన్న సిమెంట్, స్టీల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ పీరాన్, ఏఈ రామకృష్ణ, వర్కు ఇన్‌స్పెక్టర్ మల్లు హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

● సీతారామపురం: మార్చి 31లోపు జగనన్న కాలనీల్లో ఇళ్లు పూర్తి చేసుకోవాలని, లేకుంటే నిర్మాణ పథకంఆగిపోతుందని హౌసింగ్ ఏఈ కరీముల్లా తెలిపారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మంగళవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంతవరకు బేస్‌మెంట్ వేయని లబ్ధిదారులు త్వరగా వేసుకోవాలన్నారు. లేనిపక్షంలో రెవెన్యూశాఖ నుంచి ప్రత్యేక టీం వచ్చి పరిశీలన చేసి, పట్టాలు రద్దు చేస్తారని తెలిపారు. ఏప్రిల్ నుంచి స్కీమ్-2 ప్రారంభమవుతుందని తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించి, త్వరగా ఇళ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సుమతి, చిన్నయ్య, ప్రవీణ్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఆటోల నిలిపివేత

బిట్రగుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బోగోలు రైల్వే ఎల్సీగేట్ 144 వద్ద నడిరోడ్డుపైనే ఆటోలు నిలుపుతున్నారు. అలాగే రైల్వే గేట్ వేస్తే మరలా తీసేందుకు అరగంటపైనే పట్టే సమయంలో ఈ ఆటోలతో స్థానికులు మరింత ఇబ్బందులు ఎదురు అవుతున్నాయి. కూడలిలో పోలీస్ అవుట్‌పోస్ట్ ఉన్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆర్‌ఎంపీలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో పల్లెల్లో ఉంటూ ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యులకు తాను అండగా ఉంటానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని మన్నెం గోపాలక్రిష్ణారెడ్డి కల్యాణ మండపంలో భారత్‌రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగళవారం గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి మాట్లాడారు. కుల మతాలకతీతంగా రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఎమర్జెన్సీ సేవల్లో తొలుత స్పందించే వ్యక్తి ఆర్‌ఎంపీనే అన్నారు. యూనియన్లతో సంబంధం లేకుండా ప్రతి ఆర్‌ఎంపీ వైద్యుడికి తాను అండగా ఉంటానన్నారు. అసోసియేషన్‌లో నూతనంగా సభ్యత్వం తీసుకున్న వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళులు



ఆత్మకూరు: నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మకూరులో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నిర్వహించారు. పలువురు నేతలు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కరటంపాటి సుధాకర్, ఏలూరు రాజగోపాల్‌రెడ్డి, కొల్లి శ్రీనివాసులు నాయుడు, వాయుగుండ్ల ఉమ, శంకర్ పాల్గొన్నారు.

● కావలి టౌన్: బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బ్రహ్మానందం, అమరా సుబ్బారావు, సీపీసీ సత్యం, వాయుగండ్ల సుదీర్, పరుసు వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

● కందుకూరు: స్థానిక బీజేపీ నాయకులు దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల రాఘవయ్య, గట్టమనేని హరిబాబు, వైకుంఠం, మువ్వల భూషయ్య, చుండి మురళీధర్, చిన్ని పాండురంగయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం



కందుకూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యులు మంగళవారం ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 56 మంది కార్మికులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు షాజుద్దీన్ మాట్లాడారు. ఆస్పత్రిలో రక్తనిల్వ కేంద్రంలో బ్లడ్‌ప్యాకెట్ల నిల్వను పెంచటమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ డిపో మేనేజరు శ్రీనివాసరావు సహకారంతో చేపట్టిన కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది శ్రీలత, రామారావు, సుకుమార్ ఉన్నారు.

మాచవరం రైతుకు జైలు.. జరిమానా

కందుకూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):మాచవరంకు చెందిన రైతు పూనూరు వెంకట సుధాకరరెడ్డి కేసు విచారణ సమయంలో కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పిన నేరానికి ఆయనకు 6నెలలు జైలు, రూ.500ల జరిమానా విధిస్తూ నెల్లూరు 2వ అదనపు మొదటి తరగతి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి తీర్పు చెప్పారు.

న్యూస్ బాక్స్

సింథటిక్ అథ్లెటిక్ రన్నింగ్ ట్రాక్ ఇవ్వండి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మొగళ్లపాళెంలో నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ రన్నింగ్ ట్రాక్‌ని మంజూరు చేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం లోక్‌సభలో విజ్ఞప్తి చేశారు. ఇందుకు తగిన ప్రతిపాదనలు కేంద్రయువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు సమర్పించామన్నారు. కేలో ఇండియా పథకం కింద ఆ రన్నింగ్ ట్రాక్‌ను వీలైనంత త్వరగా మంజూరు చేయాలని సంబంధిత మంత్రికి సభాముఖంగా విజ్ఞప్తి చేశారు.

డిగ్రీ సప్లిమెంటరీకు గైర్హాజరు

వెంకటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో మంగళవారం జరిగిన డిగ్రీ రెండో, ఐదవ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి సీహెచ్.వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 93 మంది విద్యార్థులకు 91 మంది విద్యార్థులు హాజరయ్యారు.

మాజీ ఎంపీపీ మృతి

మనుబోలు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాజీ ఎంపీపీ అడపాల బాలచంద్రప్రతాప్(74) మంగళవారం మృతి చెందాడు. ఈయన సోమవారం రహదారి దాటుతూ ప్రమాదానికి గురై గాయపడిన విషయం విదితమే. నెల్లూరులో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ శివరాకేష్ తెలిపారు. కాగా బాలచంద్రప్రతాప్ మృతితో మనుబోలు దళితవాడలో విషాద చాయలు అలుముకున్నాయి.

ఫల సరుకులకు టెండర్లు

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ ఆలయానికి ఫల సరుకులు సరఫరా చేసేందుకు మంగళవారం ఆలయ కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. పుష్పం, కూరగాయలు, ప్రింటింగ్, విద్యుత్ సామానులు, ప్లంబింగ్ సామానులు, పారిశుధ్యం సామగ్రి, స్టేషనరీ, శేష వస్త్రములు, పూజ, అభిషేకము సామాగ్రి సరఫరా చేసేందుకు సీల్డు టెండర్లు నిర్వహించారు. ఈ వేలంలో ఈవో శ్రీనివాసులురెడ్డి, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రసన్న ఆంజనేయుడికి మండల పూజలు

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక పెద్దూరులోని కోదండరామస్వామి ఆలయంలో ప్రసన్నాంజనేయ స్వామికి బుధవారం నుంచి మండల పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 24 వరకు ఈ పూజలు జరుగుతాయని తెలిపారు.

రోడ్డుకు మోక్షం

బుచ్చిరెడ్డిపాళెం : మినగల్లు-అన్నారెడ్డిపాళెం రోడ్డు మరమ్మతులకు ఎట్టకేలకు మోక్షం లభించింది వైసీపీ పాలనలో కనిగిరి రిజర్వాయర్ సదరన్ చానల్ కాలువ వెంబడి కరకట్ట రోడ్డుపై ట్రాక్టర్లు, టిప్పర్లతో గ్రావెల్, ఇసుక రవాణా చేయడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో మినగల్లు సర్పంచు బొర్రు పూజిత సొంత నిధులతో ఎక్స్‌కవేటర్లతో మరమ్మతులు చేపట్టారు.

రోడ్డును ఆక్రమిస్తే చర్యలు : సీఐ

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక చెన్నూరు రోడ్డును ఆక్రమించి ట్రాఫిక్‌కు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసులురెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి చెన్నూరురోడ్డులో వ్యాపారస్థులు, తోపుడుబండ్ల నిర్వాహకులతో ఆయన చర్చించారు.

నేరాలకు నిలయం..

ఉడ్‌హౌస్‌సంఘం!

● వరుసగా హింసాత్మక ఘటనలు ● భయాందోళనలో స్థానికులు



మూడు రోజుల క్రితం ఉడ్‌హౌస్‌సంఘంలో హత్య జరగ్గా, ఆ ప్రాంతంలో రక్తపు మరకలు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆ ప్రాంతం నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరం....ఆత్మకూరు బస్టాండుకు వంద అడుగుల దూరంలో ఉంటుంది. ఆ ఏరియా పేరు ఉడ్‌హౌస్‌సంఘం. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఈ పేరు మారుమోగుతుంది. అంతా చూస్తుండగానే కత్తులు, కొడవళ్లతో విచక్షణ రహితంగా దాడిచేసి, హత్య చేస్తున్న వరుస ఘటనలు జరుగు తున్నాయి. ఈ ప్రాంతం నేరాలకు అడ్డాగా మారింది.

● **రెండేళ్ల క్రితం**

సరిగ్గా రెండేళ్ల క్రితం ఫిబ్రవరి 24న రాత్రి స్నేహితులతో కలిసి క్యారమ్స్ ఆడుతున్న యువకుడిని బైక్‌లపై వచ్చిన ఏడుగురు కత్తులతో విచక్షణ రహితంగా నరికి హత్య చేశారు. ఆ తర్వాత కత్తులు చేతపట్టుకొని నడుచుకుంటూ వెళ్లారు. ఈనెల 8న రాత్రి మిత్రులతో కలిసి మద్యం సేవిస్తున్న యువకుడిని రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఐదుగురు కొడవళ్లు, కత్తులతో అతి కిరాతకంగా నరికి హత్య చేశారు. ఈ రెండు సంఘటనలతో నగరంలోని ఉడ్‌హౌస్‌సంఘం, ప్రకాష్ నగర్, పప్పులవీధి ప్రాంతాల్లోని ప్రజలు రాత్రిళ్లు రాకపోకలు సాగించాలంటేనే భయంతో వణుకుతున్నారు.

● **చీకటి పడితేచాలు..**

ఉడ్‌హౌస్‌సంఘం ప్రాంతంలో బేల్దారి, పెయింట్, ఇతర కూలి పనులు చేసుకుంటూ అధికశాతం ప్రజలు జీవిస్తున్నారు. అయితే తల్లిదండ్రులు కష్టపడుతుంటే, కొంతమంది యువత మద్యానికి, గంజాయికి బానిసలుగా మారుతున్నారు. చదువుకోమని పెద్దలు చెబుతుంటే వినకుండా, పెయింట్, బేల్దారు, ఆటో, రోడ్డు సైడు వ్యాపారాలు చేసుకుంటూ, వచ్చిన నగదును వ్యసనాలకు ఖర్చు చేస్తున్నారు. గంజాయి ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా దొరుకుతుండటం, రాజకీయ నాయకుల సభలకు, పుట్టిన రోజు వేడుకలకు బైక్‌ర్యాలీలు, సంబరాలు చేస్తూ ఆయా నేతలు తమకు అండగా ఉన్నారంటూ యువత ఓ కొత్త ప్రపంచంలో బతుకుతున్నారు.ఈ సంఘం వెనుక సిమెంట్ రోడ్డులో చీకటి పడితే మద్యం, గంజాయి సేవించే బ్యాచ్‌లు ఎక్కువగా కన్పిస్తుంటాయి.



ఆ ఏరియాలో ఎటు చూసినా మద్యం సీసాలే..

● **సైరన్‌కే పరిమితం**

ఉడ్‌హౌస్‌సంఘంలో నేర ప్రవృత్తి కలిగిన వారు అధికంగా ఉన్నారని తెలిసినా, పోలీసులు సైరన్‌తో అటు వెళ్లిపోతున్నారే తప్ప, లోపలికి వచ్చి అల్లరిమూకలను చెదరగొట్టే ప్రయత్నం కూడా చేయరని స్థానికులు అంటున్నారు. రాత్రిళ్లు పోలీసు వాహనం సైరన్ మోగిస్తున్నా ఆ పక్కనే యువకులు మద్యం సేవిస్తూ ఉంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులైనా ఈ ప్రాంతంలో జరిగే హింసాత్మక ఘటనలపై చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రీసర్వేతో ఏ రైతు నష్టపోకూడదు : ఆర్డీవో అనూష

మనుబోలు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రీసర్వే వలన గ్రామాల్లో ఒక్క రైతు నష్టపోకూడదని రికార్డుల ప్రకారం సక్రమంగా రీసర్వే చేయాలని నెల్లూరు ఆర్డీవో నాగసంతోష అనూష సూచించారు. మండలంలోని పిడూరులో జరుగుతున్న రీసర్వేను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జరిగిన రీసర్వేపై రైతుల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేను పారదర్శకంగా చేయాలన్నారు. అనంతరం మనుబోలులో ఓ లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ కార్య క్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రఘురామరాజు, తహసీల్దార్ సుబ్బయ్య, సర్వేయర్ శ్రీని వాసులు, తిక్కవరపు వెంకటేశ్వర్లు రెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్, వీఆర్వో శ్రీనువాసులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నాం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందించడంతోపాటు ఉద్యోగావకాశాలు కల్పించి వారి ఉన్నతికి పాటుపడుతున్నామని కృష్ణ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి తెలిపారు. నగరంలోని అనిల్‌గా ర్డెన్స్‌లో మంగళవారం కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల వార్షికోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇంటర్, డిగ్రీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకం అందచేస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం 140 మందితో ప్రారంభమైన కళాశాల నేడు 17 వేల మందికి విద్యనందించే స్థాయికి ఎదిగిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాల్లో విజేతలను సత్కరించారు. ఈ కార్యక్ర మంలో డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి, డీన్లు రామాంజనేయులు రెడ్డి, రంగోపాల్‌రెడ్డి, పాయసం రమేష్, ఏవో హరి, చిరంజీవి, సుధారాణి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో 'రత్నం' విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న జీఎం రామ్మూర్తి నాయుడు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలో సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాల విద్యార్థులు ఆర్చరీ పోటీల్లో పతకాలు సాధించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ నేలటూరులోని ఏపీ జెన్‌కోలో ఆదివారం నిర్వహిం చిన ఆలిండియా యూత్ ఇండోర్ ఫీల్డ్ ఆర్చరీ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారన్నా రు. రోనిష్ వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను, టోఫీ, వెన్నెల, హంసినీలు బంగారు పతకాలు, సురార్చిత సాయి వెండి పతకం, శ్రీమంత్ కాంస్య పతకం సాధించారని చెప్పారు. విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రఫూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

శివపార్వతులకు పల్లకీసేవ

మనుబోలు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కామాక్షితాయి బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. మాఘపౌర్ణమి కావడంతో శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ఊరేగించారు. అంతకుమునుపు మూలవర్లకు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శివాజీ నగర్, ఎన్‌సీసీ కాలనీ, ఎన్‌బీటీ కాలనీ, డైకస్‌రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలియజేశారు.

కోనలో నేడు పుష్పయాగం

రాపూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలో మాఘపౌర్ణమి సందర్భంగా బుధవారం పుష్పయాగం నిర్వహించను న్నట్లు ఆలయ ఈవో పీ. శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిఏటా జరిగే ఈ పుష్పయాగానికి మంగళ వారం సాయంత్రం 6గంటలకు అంకురార్పణ జరిగిందని, ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించామని తెలిపారు.

కుష్ఠును ముందే గుర్తిస్తే వైకల్య నియంత్రణ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠువ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి చికిత్స చేస్తే అంగవైకల్యాన్ని అధిగమించవచ్చని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి వెల్లడించారు. మంగళవారం నగరంలోని మాడరన్ స్కూల్లో స్పర్శ పేరుతో అవగాహన కార్యక్రమం జరిగింది. కుష్ఠు రహిత జిల్లా సాధనపై విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్ర మంలో డీపీఎంవో సుబ్బయ్య, రమణారెడ్డి, తిరపతయ్య, హెచ్‌ఎం శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇందుకూరుపేట : మండలంలోని కుడితిపాలెం పెద్ద సంగంలో రేవుల పోలమ్మ (60) అనారోగ్యంతో మృతి చెందగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దొడ్ల మల్లికార్జున మంగళవారం రూ.5వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో శేషయ్య, వెంకయ్య, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఘంటసాల

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాత నేపథ్య గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు చిరస్మరణీయుడని అభినవ ఘంటసాలగా పేరుపొందిన పాటూరు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం నర్తకి సెంటర్‌లో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘంటసాల 58వ వర్ధంతి నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పుష్ప మాలలు వేసి నివాళులు అర్పించారు. సినిమాల్లో ఘంటసాల పాడిన పాటలు అజరామరం అన్నారు. ఈ కార్యక్రమంలో కేతా సుబ్బారావు, జయప్రకాష్, ప్రసాద్‌బాబు, ఆనంద్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

గండవరంలో 22 నుంచి ఉదయకాలేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కొడవలూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధి చెందిన మండలంలోని గండవరంలో వెలిసి ఉన్న ఉదయకాలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తెలిపారు. మండలంలో గండవరంలో మంగళవారం ఉదయకాళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుకు సంబంధించి నిర్వాహకులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారని తెలిపారు. వారికి మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు, టీడీపీ నాయకులు ఆలం మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య రక్ష'తో మెరుగైన వైద్యం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రూరల్ నియోజకవర్గం లో నిర్వహిస్తున్న నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల వెంగళరావు నగర్‌లో నిర్వహించిన శిబిరంలో గుర్తించిన బాధితులకు మెడికవర్ ఆసుపత్రిలో వైద్యసేవలు అందించారు. వారందరిని మంగళవారం గిరిధర్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రయోజనాలు : ఏవో

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం జారీ చేసే విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారా రైతులకు అన్నీరకాల ఆర్థిక ప్రయోజనాలు అందుతాయని మండల ఏవో ఎస్వీ నాగమోహన్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొండ్లపూడిలో రైతులతో కలిసి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. 11 అంకెలు కలిగిన ఐడీని ప్రతీ రైతుకు అందచేస్తామన్నారు. అన్నదాతలు విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పొలం తాలూకు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ జోడించి నమోదు చేసుకోవాలన్నారు.

మా పాఠశాలను విలీనం చేయొద్దు

● వావిలేటిపాడులో ముస్లింల ఆందోళన



పాఠశాల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రాంతంలోని ఉర్దూ పాఠశాలను మరో ప్రాంతంలోని పాఠశాలలో విలీనం చేయవద్దని 12వ డివిజన్ వావిలేటిపాడు ముస్లింపాళెం వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పాఠశాల ఎదుట ధర్నా నిరసన తెలిపారు. ఉర్దూ పాఠశాలలోని 3,4,5 తరుగతుల విద్యార్థులను దళితవాడలోని పాఠశాలలో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. దీని వల్ల విద్యార్థులకు భాష సమస్య ఎదురవుతుందని చెప్పారు. అధికారులు వాస్తవాలను తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలని, విద్యార్థుల తరలింపు ప్రక్రియను ఆపాలని కోరారు. కాగా, ఈ పాఠశాల భవనంలోని గచ్చు రోజు రోజుకు కుంగుతోంది. దీనివల్ల రంధ్రాలు ఏర్పడి వాటి నుంచి ఎలుకలు, పందికొక్కులు వస్తుండ టంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మీటింగ్‌కు రాకుంటే 'షోకాజ్' : కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప న్ను వసూళ్లపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు హాజరుకాని అడ్మి న్లకు షోకాజు నోటీసులు జారీ చేయాలని నగర కమి షనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. సచివా లయాలు, డివిజన్ల వారీగా సమీక్షించిన ఆయన అ త్యధిక శాతం అడ్మిన్లు హాజరుకాకపోవడంపై మండి పడ్డారు. ప్రతీ ఒక్కరూ నిర్దేశిత పన్ను వసూళ్లు నూటికి నూరు శాతం చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముందు డిప్యూటీ మేయర్‌గా ఇటీవల ఎన్నికైన తహసీన్ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా, 43వ డివిజన్ కోటమిట్ట, జెండావీధి, కుమ్మరివీధి, చేపలమార్కెట్ ప్రాం తాల్లో కమిషనర్ పర్యటించారు. పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఫ్లోర్ పాయింట్ల వద్ద మొక్కల కుండీ లు ఏర్పాటు చేయాలని యంత్రాంగానికి సూచించారు.

సీఎంఏలో 'జెనెక్స్'కి ఉత్తమ ఫలితాలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెన్సీ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏ) ప్రకటించిన జాతీయ సీఎంఏ ఫలితాల్లో నగరంలోని జెనెక్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. మంగళవారం ఆ కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో చైర్మన్ వెంగల్‌రెడ్డి, డైరెక్టర్ కొండలరావు మాట్లాడారు. సీఎంఏ ఫైనల్‌లో అఖిలభారత స్థాయిలో తమ విద్యార్థులు కే జాన్ 12వ ర్యాంకు, అఖిల్ ఆయన్ 38వ ర్యాంకు సాధించారన్నారు. సీఎంఏ ఇంటర్‌లో కే అజయ్ 14, నవ్యశ్రీ 20, వెంకట హేమంత్ 21, ప్రవీణ్‌కుమార్ 23, కే నవీన్ 25, ఎస్ అమూల్య 37, బీ పునీత్ 43వ ర్యాంకు సాధించారన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



కమ్మవారిపల్లిలో పొదుపు మహిళలకు చెక్కు అందజేస్తున్న వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ

సైదాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములచేడు, కమ్మవారిపల్లి, సైదాపురం గ్రామాల్లో రూ.65లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. ముందుగా వేములచేడులో రూ.18లక్షలతో ఎన్టీఆర్ సురక్షిత తాగునీటి పథకం, నల్లబొట్లపల్లి సుబ్బయ్య గిరిజనకాలనీలో సీసీరోడ్డు, కమ్మవారిపల్లిలో రూ.37లక్షలతో శ్మశానం రోడ్డు, సీసీరోడ్డు, బస్‌షెల్టర్, సైదాపురంలో రూ.10లక్షలతో సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని మరిచిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా మండలం లోని మొత్తం 721 పొదుపు సంఘాలకు రూ.34,71,000లు, ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్ సంఘ సభ్యులకు వ్యక్తిగత రుణాలుగా 242 మందికి రూ.5,05,000 అందచేశామన్నారు. సైదాపురం-దేగపూడి రోడ్డుకు రూ.45కోట్లతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, తహసీల్దారు రమాదేవి, జడ్పీటీసీ పోలయ్య, సర్పంచి జనార్ధన్‌రాజు, మండల టీడీపీ నాయకులు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, దిలీప్‌చౌదరి, సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి

● వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు



మాట్లాడుతున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : యువత ఆన్‌లైన్ లావాదేవీలను అత్యంత అప్రమత్తంగా, సురక్షితంగా వినియోగించుకోవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. మండలంలోని వీఎస్‌యూలో మంగళవారం వీఎస్‌యూ, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, ఎస్‌బీసీ సంయుక్త ఆధ్వర్యంలో సేఫర్ ఇంటర్నెట్ డే 2025 (సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగం)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా వీసీ విచ్చేసి మాట్లాడారు. ప్రపంచంలోని అత్యంత ఎక్కువగా యూపీఐ నగదు లావాదేవీలు మన దేశంలోనే జరుగుతున్నాయన్నారు. ఓటీపీ, డెబిట్, క్రెడిట్ కార్డుల సీవీవీ నెంబర్లు, మన వ్యక్తిగత పాస్‌వర్డ్‌లు, యూజర్ ఐడీలు అత్యంత భద్రంగా ఉంచుకోవాలన్నారు. యువత ఆన్‌లైన్ ద్వారా సులభంగా వచ్చే డబ్బులకు ఆశపడి సైబర్ మోసాల బారినపడుతున్నారని, వీటిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఎస్‌బీసీ సమాచార అధికారి సురేష్‌బాబు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్, ప్రదీప్‌కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ సదారావు, జిల్లా నెహ్రూయువకేంద్రం అధికారి మహేంద్రరెడ్డి, ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ, సైబర్ క్రైం ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి అందె ప్రసాద్ పాల్గొన్నారు.

పుస్తకాలతో అనుబంధం పెంచుకోవాలి



పోస్టరు ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, ఎంఈవోలు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే పుస్తకాలతో అనుబంధం పెంచుకోవడం వల్ల జీవితం ఆనందం, ప్రశాంతంగా ఉంటుందని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. మంగళవారం స్థానిక బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో ఎస్ఆర్ఐ వాసవి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తకమిత్ర గ్రంథాలయాన్ని ఎంపీడీవో ప్రారంభించి మాట్లాడుతూ పిల్లలు పుస్తకాలు చదవడం ద్వారా మహనీయుల జీవిత చరిత్రతో స్ఫూర్తి పొంది ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. మండల విద్యాశాఖ అధికారులు ఎస్వీ నాయక్, పీవీ రత్నం మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం పుస్తక పఠనం చేసి విజ్ఞానము, వికాసము, విచక్షణ, వ్యక్తిత్వ వికాసము, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత, జిల్లా రిసోర్సు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

● మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రామారావు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు, బాలికలతో అమర్యాదగా, అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ కేసిహెచ్ రామారావు హెచ్చరిం చారు. నగరంలోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులకు మంగళవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ రకాల నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఏసుదాసు, సెట్నల్ సీఈవో ఏ నాగేశ్వరావు, మహిళా పోలీసు స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏఎస్ఐ వై శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌లో అవగాహన

విద్యార్థినులు అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని నగర డీఎస్పీ సింధుప్రియ సూచించారు. నగరంలోని సంతపేటలో గల సెయింట్ జోసెఫ్ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులకు మంగళవారం మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అపరిచితుల నుంచి ఎలాంటి ఇబ్బందులు పడుతు న్నా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సంతపేట స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు పాల్గొన్నారు.

దీనదయాళ్ ఉపాధ్యాయకు నివాళి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పదవులు ఉన్నా లేకున్నా అందరూ బాగుండాలి అందులో నేను ఉండాలి అనే ఆధ్యాత్మిక విలువతోకూడి ప్రజలకు సేవ చేసిన దీనదయాళ్ ఉపాధ్యాయ అందరికీ ఆదర్శమని బీజేపీ నమామి గంగే ప్రాజెక్టు రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ తెలిపారు. నగరంలోని మూలాపేట అలంకార్ సెంటర్‌లో బీజేపీ నాయకులు మంగళవారం దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, నాయకులు నరేష్, చిత్తాతూర్ పద్మావతి, నాగలక్ష్మి, అల్లూరు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● ఇందుకూరుపేట : పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా మండలంలోని కొత్తూరులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసరెడ్డి, నాయకులు నేట్రంబాక శివప్రసాద్, అత్తిపాటి శరత్, వాకాటి ప్రసాద్, వాయుగుండ్ల కృష్ణ, దొంతాల మహేష్, పునామల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆపార్టీ రూరల్ మండల అధ్యక్షుడు సిద్దన మనోహర్‌రెడ్డి అధ్వర్యంలో పలువురు నాయకులు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమలో రఘురామయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణాల చెరువులో చేప పిల్లల విడుదల



చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి) : మత్స్యకారుల ఉపాధి కోసం నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఘాట్ వద్ద స్వర్ణాల చెరువులో మంగళవారం చేపపిల్లలను వదిలారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని రూ.8లక్షల విలువైన చేపపిల్లలను నీటిలో విడిచి పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, డివిజన్ కార్పొరేటర్ కే విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి పాలూరు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు బాబ్జీ, ఉచ్చూరు సురేష్ ఈశ్వర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లో పనులు మొదలవ్వాలి

నెల్లూరు రూరల్ : నగరంలోని పొదలకూరు రోడ్డు నిర్మాణ పనులు 24 గంటల్లో మొదలవకపోతే ఊరుకునే ప్రసక్తేలేదని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికారులను హెచ్చరించారు. పొదలకూరు రోడ్డు పనుల్లో జాప్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని ఆ ప్రాంత వాసులు మంగళవారం ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మంజూరైన పనులను ఎందుకు ఆపారని ప్రశ్నించారు. 24 గంటల్లో పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

గురు నిలయంలో ధుని పూజ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట గురు నిలయంలో మంగళవారం రాత్రి వ్యాస పూర్ణిమ సందర్భంగా ధుని పూజ జరిగింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భగవాన్ వెంకయ్యస్వామి, మాకాని వెంకట్రావు విగ్రహాల కు పూజలు, భజన చేశారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

కార్పొరేట్ బడులు వెలవెలపోయేంతగా ప్రభుత్వ బడుల రూపు రేఖలే మార్చేస్తాం అన్నారు. అందమైన భవనాలు, ఫర్నిచర్.. ఫిల్టర్ వాటర్, శుభ్రమైన టాయ్‌లెట్లు... ఒక అద్భుతం చేసి చూపిస్తాం అని చెప్పారు. "మన బడి... నాడు-నేడు" అని దానికి పేరు కూడా పెట్టి ఊదరగొట్టారు. జగన్ ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులుగా చెప్పుకున్న ఈ బడులు జిల్లాలో ఎలా ఉన్నాయి? నిజంగానే రూపు రేఖలు మారిపోయాయా? జగన్ ప్రభుత్వం మొదటి విడత "మన బడి... నాడు-నేడు" కింద అభివృద్ధి చేసిన స్కూళ్ల స్థితిగతులెలా వున్నాయో.. పరిశీలనకు పూనుకుంది ఆంధ్రజ్యోతి. మంగళవారం మా ప్రతినిధులు కొన్ని పాఠశాలలను సందర్శించి వాటి స్థితిగతులను సచిత్రంగా అందిస్తున్నారు.

-తిరుపతి, ఆంధ్రజ్యోతి



కోట మండలం చిట్టేడు ఉన్నత పాఠశాలలో బెంచీల్లేక కింద కూర్చున్న విద్యార్థులు



నాడూ.. నేడూ.. ఏం మారింది సారూ?

ఆంధ్రజ్యోతి విజిట్

- జిల్లాలో తీరుమారని ప్రభుత్వ పాఠశాలలు
- ఆర్భాటంగా జగన్ ప్రభుత్వ ప్రచారం
- అరకొర పనులతో అసంపూర్తిగా వదిలేసిన వైనం
- పూర్తయిన పనులకూ నిర్వహణ లోపం
- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ పరిశీలనలో వెల్లడైన వాస్తవాలు

పాకాల ఎస్‌వీఎస్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో అసంపూర్తిగా తరగతి గది నిర్మాణం

పాకాల: రక్షిత నీరు లేదు

పాకాల, ఆంధ్రజ్యోతి: పాకాలలో ఇంగ్లీషు, తెలుగు మీడియం స్కూళ్ళు ఒకే ఆవరణలో వున్నాయి. అదనపు తరగతి గది నిర్మాణం అసంపూర్తిగా వుంది. టాయిలెట్ బ్లాక్ సైతం అసంపూర్తిగానే వుంది. తాగునీటి ఆర్వో సిస్టమ్ పనిచేయడం లేదు. మండలంలో మొదటి విడత నాడు-నేడు కింద ఎంపికైన స్కూళ్ళలో 15 స్కూళ్లలో ఆర్వో సిస్టమ్ పనిచేయడం లేదు.



తిరుచానూరు జడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదులకు సున్నాలు కూడా కొట్టని వైనం

తిరుచానూరు జడ్పీ హైస్కూల్: భయపెడుతున్న గదులు

తిరుచానూరు, ఆంధ్రజ్యోతి: తిరుచానూరు జడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయినా ఫినిషింగ్ పనులు పెండింగులో వున్నాయి. సున్నాలు కూడా కొట్టించలేదు. అయితే ఆ గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. గదుల్లో ఎలక్ట్రిఫికేషన్ తూతూ మంత్రంగా చేపట్టారు. గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల కోసం వైర్లు ఎలాబడితే అలా అమర్చివుండడం కనిపించింది.





చిన్నగొట్టిగల్లు ప్రాథమిక పాఠశాలలో అర్ధాంతరంగా ఆగిన అదనపు తరగతి గది నిర్మాణం - పనిచేయని ఆర్వో సిస్టమ్

చిన్నగొట్టిగల్లు బడి: అన్నీ అరకొర పనులే!

చిన్నగొట్టిగల్లు, ఆంధ్రజ్యోతి: చిన్నగొట్టిగల్లు ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం సగంలోనే ఆగిపోయింది. నీటి కొరతతో తాగునీటి ఫిల్టర్ సిస్టమ్ వినియోగంలో లేదు. సరఫరా అవుతున్న కొద్దిపాటి నీరు టాయిలెట్ల వాడకానికే సరిపోతోంది. స్కూలు ప్రహరీ గోడ కూలిపోయి చాలాకాలమైంది. అయినా పనులు చేపట్టలేదు.



చంద్రగిరి జడ్పీ బాలుర హైస్కూలు తరగతి గదిలో ఫ్యానుకు రెండే రెక్కలున్న దృశ్యం

మంగళం ట్రెండ్స్ పాఠశాల: అసంపూర్తి నిర్మాణాలు

తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి: జిల్లాలోనే గణనీయంగా అభివృద్ధి చెందిన జడ్పీ హైస్కూలుగా తిరుపతి అర్బన్ మండలం మంగళంలోని ట్రెండ్స్ పాఠశాలకు గుర్తింపు వుంది. తొలి విడత నాడు-నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. రెండంతస్తుల భవనం శ్లాబులు పూర్తయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో గోడలు కట్టారు. పై అంతస్తులో అది కూడా లేదు. నిధుల కొరతతో అర్థంతరంగా పనులు ఆపేశారు. తాగునీటి సదుపాయం వుంది కానీ ఫిల్టర్ సిస్టమ్ లేదు. చదువులు చెప్పే ఉపాధ్యాయులకు కుర్చీలు, టేబుళ్ళు వంటి ఫర్నిచర్ ఇంతవరకూ రాలేదు. ప్రహరీ గోడల నిర్మాణం కూడా అసంపూర్తిగా ఆగిపోయింది.



మంగళం ట్రెండ్స్ హైస్కూల్లో అసంపూర్తిగా వున్న అదనపు తరగతి గదుల నిర్మాణం

చంద్రగిరి బాలుర హైస్కూల్: రెండు రెక్కల ఫ్యాను

చంద్రగిరి, ఆంధ్రజ్యోతి: చంద్రగిరి జడ్పీ బాలుర హైస్కూల్లో తరగతి గదులకు కిటికీలు పగిలిపోయి వున్నాయి. విద్యార్థులకు డెస్కులు, టీచర్లకు కుర్చీల కొరత వుంది. ల్యాబ్‌లో నాలుగేళ్ళుగా పరికరాలు లేవు. గ్రీన్ చాక్ బోర్డులు, స్మార్ట్ టీవీ ఏర్పాటు కాలేదు. ఓ తరగతి గదిలో ఫ్యానుకు రెక్క విరిగిపోవడంతో రెండు రెక్కలతో కనిపిస్తోంది. అక్కడే జడ్పీ బాలికల హైస్కూలులో ఉపాధ్యాయుల గది పైకప్పు పూర్తిగా దెబ్బతిని వర్షాలకు ఉరుస్తోంది. సభా వేదిక సైతం వర్షాలకు ఉరుస్తోంది. అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయింది. వంట గది లేదు.

ఇలా ఉన్నాయి బడులు..

జిల్లాలో సైతం రెండు విడతల్లో 1800 పాఠశాలలను ఎంపిక చేసిన ప్రభుత్వం అరకొర నిధులతో ఉపాధ్యాయుల గొంతుపై కూర్చుని పనులు మొదలు పెట్టించింది. ఆపై నిధుల కొరత, నిర్లక్ష్యాలతో అర్ధాంతరంగా పనులు నిలిపేసింది. అటు పనులూ పూర్తి కాకపోగా, ఇటు పనులు చేపట్టిన ఉపాధ్యాయుల చేతి చమురు కూడా వదిలింది.

- వడమాలపేట మండలం సీతారామాపురం హైస్కూలులో అర్ధాంతరంగా ఆగిన అదనపు తరగతి గదుల నిర్మాణం
- పుత్తూరు మండలం పిళ్ళారిపట్టులో అర్ధాంతరంగా ఆగిన అదనపు తరగతి గదుల నిర్మాణం.
- వడమాలపేట మండలం పాదిరేడు యూపీ స్కూలులో పనిచేయని ఆర్వో ప్లాంటు.




డెస్కులున్నా నేలపైనే కూర్చున్న విద్యార్థులు

ఏకొల్లు ప్రైమరీ బడి: ఏదీ వాడడం లేదు!

దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి: దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామంలోని ప్రైమరీ స్కూల్లో నాడు-నేడు కింద అన్ని వసతులూ కల్పించారు. కానీ దేన్నీ వాడడం లేదు. వంట గది, మరుగుదొడ్లు కూడా కట్టించారు. అయితే నీటి కొరతతో వినియోగించలేక వాటికి తాళాలు వేశారు. ఆర్వో ఫిల్టర్ సిస్టమ్ వున్నా వాడకుండా మూలన పడేశారు. ఫర్నిచర్ వున్నా పిల్లలు నేలపైనే కూర్చుని చదువుకుంటున్నారు. స్మార్ట్ టీవీ కూడా వుంది. కానీ వాడడం లేదు. గ్రీన్ చాక్ బోర్డులు, ఫర్నిచర్ అంతా ఓ గదిలో మూలన పడేశారు. ప్రహరీ ఒక వైపు కట్టలేదు. గోడలపై పెయింటింగ్ చేయలేదు.



వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం ఉన్నత పాఠశాలలో టాయిలెట్లకు నీటి సరఫరా లేక తలుపులకు వేసిన తాళాలు



భూ బకాసురులపై ఉక్కుపాదం

- ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు దిశగా యంత్రాంగం చర్యలు

జిల్లాలో శాంతిభద్రతల సమస్యకు ప్రధాన కారణం.. భూ ఆక్రమణలు. పైసా పైసా కూడబెట్టి, అప్పోసప్పో చేసి స్థలం కొనే నిరుపేదల ఆశలను, ఆర్థికస్థితిగతులను ఛిన్నాభిన్నం చేస్తున్నదీ భూకబ్జాలు. సొంతింటి కలలను కల్లలు చేసేదీ భూబకాసురులే.

గత సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ఎస్పీ కార్యాలయానికి వచ్చిన 95 అర్జీల్లో 63 భూసమస్యలకు సంబంధించినవే. మంగళవారం ఎస్పీ హర్షవర్ధన రాజుకు అందిన నాలుగు ఫిర్యాదులూ ఇవే.

ఘర్షణలకు కారణమవుతున్న.. సామాన్యుల జీవితాలను తల్లకిందులు చేస్తున్న భూ ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపేలా ఎస్పీ చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చించి రోడ్‌మ్యాప్ సిద్ధం చేయనున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

అధికారం.. అధికారుల అండ ఉంటే చాలు. తనది కాని భూమిని సొంతం చేసుకుంటున్నారు కొందరు. రికార్డుల్లో పేర్లే మార్చేస్తున్నారు. తిరుపతి నగరంలో అయితే మరీ రెచ్చిపోతున్నారు. సామాన్యుల స్థలాలను కబ్జాచేసేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదేంటని అడిగితే దాడులు చేస్తున్నారు. చంపేస్తామంటూ బెదిరిస్తున్నారు. దీంతో భూ బకాసురుల ఆగడాలను ఎదుర్కోలేక సామాన్యులు కుమిలిపోతున్నారు. వీటిపై అధికారులకు ఫిర్యాదులు చేయడమే కానీ న్యాయం జరిగిన దాఖలాలు లేవు. భూ ఆక్రమణలు ఆగనూ లేదు. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం భూ వివాదాలకు సంబంధించినవే. ఈ క్రమంలో భూకబ్జాలకు అడ్డుకట్ట వేస్తే జిల్లాలో శాంతిభద్రతలు మెరుగు పడతాయని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఈ దిశగా కలెక్టరుతో చర్చించి ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటుకు పోలీసు యంత్రాంగం రంగం సిద్ధం చేస్తోంది. ఎక్కడెక్కడ భూ బకాసురులు ఉన్నారు? ఎప్పటి నుంచి.. ఎక్కడెక్కడ భూములు ఆక్రమిస్తున్నారు? వారి నేర చరిత్ర ఏమిటి? వారి వెనుక ఉన్న రౌడీలు, గూండాలు ఎవరనే దానిపై లోతుగా అధ్యయనం చేయనున్నారు. జిల్లాతో పాటు ప్రధానంగా తిరుపతిలో పెరిగిపోతున్న భూ ఆక్రమణలపై గట్టి చర్యలు తీసుకోవడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి.. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలతో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ప్రత్యేక టాస్క్‌ఫోర్సులో రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో రిటైర్డు న్యాయమూర్తి, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్, రిటైర్డు తహసీల్దార్, అనుభవజ్ఞులైన మేధావులు, నగర ప్రముఖులు, సర్వేయర్లను నియమించే యోచనలో ఉన్నారు. దీనికి సంబంధించి త్వరలో జిల్లా అధికారులు సమావేశమై నిర్ణయం తీసుకునే అవకాశాలు వున్నాయి. ఇదే అమలైతే జిల్లాలో భూ ఆక్రమణలకు చాలావరకు అడ్డుకట్ట పడే అవకాశాలున్నాయి.

భూకబ్జాలపై కఠిన చర్యలు

జిల్లాతో పాటు తిరుపతిలో పెరిగిపోతున్న భూ కబ్జాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధనరాజు స్పష్టంచేశారు. మంగళవారం తనను కలిసిన 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. భూఆక్రమణలకు పాల్పడేవారి జాబితాను తెప్పించుకుని ఆ తర్వాత అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అవసరమైతే భూ ఆక్రమణలపై ఫిర్యాదుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వీటన్నింటిపై త్వరలో కలెక్టర్‌తో చర్చించి భూ ఆక్రమణలకు పూర్తిస్థాయిలో చెక్‌పెట్టేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. దీనివల్ల శాంతి భద్రతల సమస్యలు తగ్గే అవకాశాలున్నాయన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిశారు

- పలువురికి అత్యుత్తమ పర్సంటైల్ మార్కులు



మణిదీప్‌రెడ్డి



నిఖిల్



యశ్విత

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ఐటీలలో ప్రవేశాలకోసం నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ(ఎన్టీఏ) ఆధ్వర్యంలో గతనెలలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ తొలివిడత ఫలితాలను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు ఈఫలితాల్లో తిరుపతిలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదివే పలువురు విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ మార్కులు సాధించి సత్తాచాటారు. వీరిలో నారాయణ విద్యాసంస్థలకు చెందిన ఎం.భానుచరణ్‌రెడ్డి(99.99 పర్సంటైల్), డి.మణిదీప్‌రెడ్డి (99.98), కె.నిఖిల్ (99.98), టీవీ ధనుష్ (99.97), కార్తీక్ శ్రీలక్ష్మీపతి (99.93), కె.యశ్విత (99.90), శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన కె.అభిరామ్ (99.83), ఓరుగంటి మోక్షిత్ శర్మ (99.83), కె.జీవనకుమార్ (99.26), వై.నిఖిల్ (99.08), బీవీకే జూనియర్ కళాశాల (అమరావతి ఐఐటీ అకాడమీ)కు చెందిన బి.అరుణ్‌కుమార్‌రెడ్డి (99.93), శ్రీధర్స్ ఐఐటీ, జేఈఈ-నీట్ అకాడమీ విద్యార్థి పి.నిఖిలేశ్వర్ (99.25) పర్సంటైల్ మార్కులు సాధించి ప్రతిభచాటారని నిర్వాహకులు పేర్కొన్నారు.



ఓఎం శర్మ



జీవన్‌కుమార్



నిఖిల్

సత్తాచాటిన అధ్యాపకుడి కుమారుడు

శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లెకి చెందిన ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు మాండవీపురం జయభారత్‌రెడ్డి, రేఖ దంపతుల కుమారుడు భానుచరణ్‌రెడ్డి 99.99 పర్సంటైల్ మార్కులతో సత్తాచాటారు. 'ఐఐటీయే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించుకుని సాధన చేస్తున్నా. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలను అధ్యయనం చేశా. కళాశాలలో టీచర్లు బోధించే అంశాలను క్రమం తప్పకుండా సాధన చేశా. అడ్వాన్స్‌లో మంచి పర్సంటైల్ సాధించి ఐఐటీలో ఇంజినీరింగ్ చేయాలన్నది ఆశయం' అని భానుచరణ్ రెడ్డి పేర్కొన్నారు.



భానుచరణ్‌రెడ్డి

ప్రతిభచాటిన ప్రభుత్వ టీచర్ కుమారుడు

శ్రీకాళహస్తికి చెందిన ప్రభుత్వ టీచర్ శ్రీనివాసబాబు, రాధిక దంపతుల కుమారుడు కె.అభిరామ్ 99.83పర్సంటైల్ మార్కులతో ప్రతిభచాటారు. 'ఐఐటీలో సీటు సాధనే లక్ష్యంగా అభ్యసన సాగించడంతో మంచి పర్సంటైల్ వచ్చింది. కళాశాలలో టీచర్స్ చెప్పిన నోట్స్, మెటీరియల్, టెక్నిక్స్‌ని క్రమం తప్పకుండా అనుసరించా. అడ్వాన్స్‌లో మంచి పర్సంటైల్ సాధించి ఐఐటీలో ఇంజినీరింగ్‌విద్యని చదవాలన్నది నా లక్ష్యం' అని అభిరామ్ చెప్పారు.



అభిరామ్

రైతు ఇంట విద్యాకుసుమం

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కుక్కరాజుపల్లెకి చెందిన రైతు రఘురామ్‌రెడ్డి, రమాదేవి దంపతుల కుమారుడు అరుణ్‌కుమార్‌రెడ్డి 99.83 పర్సంటైల్ సాధించారు. 'టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని.. నిరంతరం సాధన చేయడం వల్ల మంచి పర్సంటైల్ వచ్చింది. కెమిస్ట్రీకి ఎన్‌సీఈఆర్టీ బుక్స్, గణితం, ఫిజిక్స్ సబ్జెక్టులలో అధ్యాపకులు బోధించిన నోట్స్‌ని ప్రణాళిక ప్రకారం అధ్యయనం చేశా. ఐఐటీలో సీటు సాధించాలన్నది ఆశయం' అని అరుణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.



అరుణ్‌కుమార్‌రెడ్డి

రాణించిన టీవీ టెక్నీషియన్ కుమారుడు

తిరుపతి నగరం జీవకోనకు చెందిన టీవీ టెక్నీషియన్ దయాకర్, మహేశ్వరి దంపతుల కుమారుడు పి.నిఖిలేశ్వర్ 99.25పర్సంటైల్ మార్కులు పొందారు. 'కళాశాలలో అధ్యాపకులు బోధించిన టెక్నిక్స్ ఉపయోగపడ్డాయి. పాఠశాల విద్య నుంచీ ఐఐటీలో సీటు సాధించాలన్న ఆశయంతో ప్రణాళిక ప్రకారం చదివా. అడ్వాన్స్‌లోనూ మంచి పర్సంటైల్ చూపి ఐఐటీలో కంప్యూటర్‌సైన్స్ ఇంజినీరింగ్ చేయాలన్నది లక్ష్యం' అని చెప్పారు నిఖిలేశ్వర్.



నిఖిలేశ్వర్

టీటీడీకి విరాళంగా ద్విచక్రవాహనాలు



తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): శ్రీవారికి మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన టీవీఎస్, బెంగళూరుకు చెందిన డీఎస్ ఎకో సంస్థల ప్రతినిధులు ఈ విద్యుత్ ద్విచక్రవాహనాలను అందజేశారు. టీవీఎస్ ఐ క్యూబ్ ఎక్స్ వాహనం ధర రూ.2.70 లక్షలు, ఎన్‌డీఎస్ ఎకో వాహనం ధర రూ.1.56 లక్షలు అని ప్రతినిధులు తెలిపారు. ఆలయం ముందు ఈ వాహనాలకు పూజలు నిర్వహించాక టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి సంస్థల ప్రతినిధులు తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీఎస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్, ఎండీ సుదర్శన్, ఎన్‌డీఎస్ ఎకో సంస్థ చైర్మన్ ఎంహెచ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి సేవలో హీరో కార్తీ

తిరుమల, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): తమిళ హీరో కార్తీ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కార్తీకి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం కార్తీ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో ఖైదీ-3, సర్దార్2 చిత్రాలు అభిమానుల ముందు రాబోతున్నట్లు తెలిపారు. తన కుమారుడు పుట్టిన తర్వాత తొలిసారిగా తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. హీరో కార్తీని ఆలయం ముందు చూసేందుకు పలువురు అభిమానులు పోటీ పడ్డారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారినీ కార్తిక్ దర్శించుకున్నారు. కాగా, తిరుమల శ్రీవారిని నటి భువనేశ్వరి దర్శించుకున్నారు.



ఆలయం ముందు హీరో కార్తీ - భువనేశ్వరి

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శనం భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.4.33 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,169

తలనీలాలు సమర్పించినవారు: 24,559





అపాచీ, శ్రీసిటీ పారిశ్రామిక ప్రాంతంలో ఉంది కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం. చోళరాజుల కాలం నాటి గుడి ఇది. ఆ పురాతన వాతావరణం ఆలయ ప్రాంగణంలో కనిపిస్తుంది. చినమాంబట్టు గ్రామంలో శ్రీకాశీవిశ్వేర, అన్నపూర్ణాదేవి ఆలయంగా నిత్యపూజలందుకుంటోంది. పురాతన శిల్పాలతో నిండిన ఈ ఆలయం చిన మాంబట్టు గ్రామంలో ఉంది.

- తడ, ఆంధ్రజ్యోతి

చోళ కళావైభవం

మాంబట్టు కాశీవిశ్వేశ్వరాలయం

చరిత్ర: క్రీ.శ 11వ శతాబ్దంలో నిర్మించిన ఆలయం ఇది. ఇందుకు ఆధారమైన శాసనాలు ఉన్నాయి. తొలుత గర్భగుడి, అర్ధమండపం నిర్మించారు. 13వ శతాబ్దంలో ఈ స్తంభమండపం నిర్మాణం జరిగింది. పల్లవ, చోళ శాసనాల్లో ఉన్న 'బట్టారక, పరమబట్టారక' అనే పదాలను పరిశీలిస్తే 'బట్టు' అనే పదమే కాలక్రమంలో మాంబట్టు అనే ఊరి పేరుగా మారి ఉండవచ్చని భావిస్తారు.

పురాణ ప్రాశస్త్యం: ఈ గ్రామానికి చెందిన ఒక బ్రాహ్మణుడి కోరిక మేరకు చోళుల కాలంలో శివాలయాన్ని నిర్మించారు. ఆలయానికి అవసరమైన భూమిని అదే గ్రామానికి చెందిన గుంటూరు మహదేవమ్మ అందించగా, యనమండ్రం నారసింహయ్యశర్మ, వెంకటరామయ్యశర్మలు అర్చకత్వానికి సిద్ధమయ్యారు. ఆలయం అయితే పూర్తవుతుంది కానీ ప్రతిష్ఠించడానికి దేవుడు కావాలి కదా. ఈ సమయంలో కాశీ నుంచి రామేశ్వరం వెళ్తున్న ఒక యాత్రీకుడు పాలరాతి శివలింగాన్ని ఇచ్చాడు. శివుడితోపాటూ అన్నపూర్ణాదేవి విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించారు. కాలక్రమంలో చండీకేశ్వరి, దుర్గాదేవి, కాలభైరవుడు, నందీశ్వరుడు, మహావిష్ణువు, శ్రీవల్లి, దేవసమేత సుబ్రమణేశ్వరిస్వామి విగ్రహాలతోపాటు ధ్వజస్తంభం ఏర్పాటైంది. భక్తుల కోర్కెలు తీర్చే దేవుడిగా కాశీవిశ్వేశ్వరుడికి ప్రతీతి.



మాన్యం మాయం: వెంకటగిరి రాజుల పోషణ: మాంబట్టు కాశీవిశ్వేశ్వరుడి ఆలయం వద్ద తొలుత 26 బ్రాహ్మణ కుటుంబాలు అర్చకత్వంలో ఉండేవని చెబుతారు. వీరంతా ఆ తర్వాత వలస పోవడంతో ఆలయ పూజా కైంకర్యాలకు కొదవ ఏర్పడింది. పరిస్థితి వెంకటగిరి రాజుల దృష్టికి వెళ్లింది. వారు స్వామివారికి 79.43 ఎకరాలు, అమ్మణ్ణికి పసుపు, కుంకాల రూపేణ 25 ఎకరాల మాన్యం ఇచ్చారు. దాంతోనే ఆలయ ధూపదీప, నైవేద్యాలు నడిచేవి. 2006లో ఆ భూములను పరిశ్రమలకు అప్పగించడంతో ఇప్పుడు ఆ మాన్యమూ లేకుండా పోయింది.





శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి పాలరాతి శివలింగం - అన్నపూర్ణాదేవి

ఆలయం శ్లాబు రాతిబండలపై చెక్కిఉన్న మత్స్యం, ఉడుము, భక్తుల శిల్పాలు ఆకారాలు



తగ్గని వైభవం: శిథిల స్థితికి చేరుకున్న ఆలయాన్ని గ్రామస్థులే పట్టించుకుని పూర్ణోద్ధరణకు పూనుకున్నారు. ఉత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు 9 రోజుల పాటు జరుగుతాయి. కార్తీకమాస ఉత్సవాలు మాత్రం తెలుగు, తమిళ సాంప్రదాయాల ప్రకారం రెండు నెలలపాటు నిర్వహిస్తున్నారు రోజూ రెండు పూటలా ధూపదీప, నైవేద్యాల సమర్పణ జరుగుతుంది.. గ్రామ రైతు మన్నె శంకరయ్య విరాళంగా ఇచ్చిన స్థలంలో గ్రామస్థులంతా కలిసి అన్నదాన సత్రం నిర్మించుకున్నారు. ప్రతి పౌర్ణమికీ ఇక్కడ అన్నదానం జరుగుతుంది.

శివరాత్రి ఉత్సవాలు: అంగరంగవైభవంగా నిర్వహించేవారు. శివరాత్రిని చిన్నమాంబట్టులోని ఆలయంలో, కళ్యాణోత్సవాన్ని పెద్దమాంబట్టు ఆలయంలో, పారువేట ఉత్సవాన్ని ఎన్ఎంకండ్రి గ్రామంలో నిర్వహిస్తూ ఉండేవారు. ఆ ఆనవాయితీ నేటి కొనసాగుతూ ఉంది.



చెన్నై- బెంగళూరు కారిడార్‌కు పచ్చజెండా

● రూ.78.84 కోట్ల నష్టపరిహారం విడుదల



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులో అభివృద్ధి కోసం ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందజేయడానికి రూ.78.84 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడర్ ప్రాజెక్టు అభివృద్ధికి కోట మండలం కొత్తపట్టణం, చిల్లకూరు మండలం తమ్మినపట్టణంలో ప్రభుత్వ భూమిలో సాగులోని రైతులకు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందించలన్నారు. సాగులోని భూములను సర్వేచేసి, క్షేత్రస్థాయిలో నిర్ధారణ చేసుకున్న తరువాత నష్టపరిహారం పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్‌రెడ్డి, శివకుమార్,కోట, చిల్లకూరు మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

17, 18న శాయ్ హాస్టల్ సెలక్షన్స్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 17, 18 తేదీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్(యానం)సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ ప్లేయర్స్ ఆ రోజుల్లో ఉదయం 9గంటలకు యానం శాయ్ ట్రైనింగ్ సెంటర్‌కు వెళ్లాల్సి వుంది. బ్యాడ్మింటన్‌కు 12నుంచి 18 సంవత్సరాల వయస్సు బాలురు, స్విమ్మింగ్‌కు 12నుంచి 16 సంవత్సరాల వయస్సు బాల, బాలికలు అర్హులు. జనన ధృవీకరణపత్రం, ఆధార్, ఇప్పటి వరకు పొందిన క్రీడా ప్రశంసాపత్రాలు, గవర్నమెంట్ మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, సొంత స్పోర్ట్స్ కిట్ తీసుకురావాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 98662 39009 (బ్యాడ్మింటన్), 88851 76888 (స్విమ్మింగ్) నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతుకు గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులాగే రైతుకు 11 అంకెలతో యూనికోడ్‌ని కేటాయించడానికి కేంద్రం నిర్ణయించిందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయడానికే ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం భూ యజమానులకు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీ జరుగుతోందన్నారు. తొలుత పీఎం కిసాన్ లబ్ధిదారులకు.. ఆ తర్వాత మిగిలిన భూ యజమానులకు రిజిస్ట్రీ నెంబర్లు జారీ చేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పొందాలంటే భూ యజమానులు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులందరూ తమపేరు, గ్రామం, ఆధార్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరు వివరాలను సమీపంలోని రైతు సేవాకేంద్రంలో సిబ్బందికి ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందవచ్చన్నారు. వెళ్లలేని పరిస్థితిలో ఫోన్ ద్వారా రైతు సేవా కేంద్రంలోని సిబ్బందికి వివరాలు తెలిపి ఓటీపీ ద్వారా నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఈ నెల 25వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు.

అసంఘటిత కార్మికులంతా 'ఈశ్రమ్' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి అసంఘటిత కార్మికుడు తన వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, సంక్షేమ పథకాలు పొందాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్‌పై మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. 16-59 సంవత్సరాల వరకు కార్మికులు అర్హులన్నారు. కార్మికుడి ఆధార్‌కార్డు, ఆధార్ లింకుతో ఫోన్, బ్యాంకుఖాతా వివరాలు ఉంటే ఈ పథకంలో చేరవచ్చన్నారు.

ముక్కంటి సేవలో గాయకులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ప్రముఖ గాయకులు రమ్య బెహరా, అనురాగ్ కులకర్ణి మంగళవారం దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వారం రోజుల్లో 41.5 కిలోల గంజాయి సీజ్

● బహిరంగ మద్యపానాలపై 913 కేసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. వారాంతపు నివేదికను మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేసి మాట్లాడారు. రాత్రి, పగలు గస్తీ పెంచామన్నారు. అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న వారిపై నిఘా పెంచామన్నారు. ఈ వారం రోజుల వ్యవధిలో రాత్రి పూట రోడ్లపైన తిరుగుతున్న 165 మంది అనుమానితులను ఆయా పోలీసు స్టేషన్లకు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరించి దాదాపు 41.5 కిలోలు సీజ్ చేసినట్లు చెప్పారు. బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై 913 కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించినట్లు వివరించారు. బహిరంగంగా మద్యం తాగే 81 ప్రాంతాలను గుర్తించి అక్కడ అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేశామన్నారు. 119 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. విద్యాసంస్థలు, యూనివర్శిటీలకు సమీపంలోని బడ్డీ కొట్టులు, దుకాణాలు, కిరాణా షాపుల వద్ద ఆకస్మిక తనిఖీలు చేసి గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు. పుత్తూరు, తిరుపతి, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, నాయుడుపేట, నాగలాపురం, చంద్రగిరి ప్రాంతాల్లో.. విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న దుకాణాల్లో మంగళవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో పలు ప్రదేశాల్లో తనిఖీలు చేశారు.

రైలు ఢీకొని గ్యాంగ్‌మేన్ దుర్మరణం

● మరొకరికి తీవ్ర గాయాలు



ఏఆర్ అభిషేక్ (ఫైల్‌ఫొటో)

తడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొనడంతో విధుల్లో ఉన్న ఓ గ్యాంగ్‌మేన్ దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తడ మండలం అనపగుంట రైల్వేగేటు సమీపంలో ఐదుగురు సభ్యులతో కూడిన గ్యాంగ్‌మెన్ మంగళవారం పట్టాలపై గేజ్ లెవల్ తనిఖీ చేపట్టారు. ఈ బృందంలోని మేస్త్రీ దగ్గరలోని గేటు వద్దకు వెళ్లి గేట్‌మ్యాన్‌తో మాట్లాడుతుండగా, మరో ఇద్దరు తాగునీటి కోసం పక్కకు వెళ్లారు. మిగిలిన ఏఆర్ అభిషేక్(30), ముంజయ్ కుమార్ పని చేస్తుండగా నాగర్ కర్నూల్ నుంచి ఎర్నాకులం వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వేగంగా దూసుకొచ్చింది. దీంతో బిత్తరపోయిన ముంజయ్ కుమార్ పట్టాలపై నుంచి ఎగిరి పక్కకు దూకగా, అభిషేక్ పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తుండగా ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ముంజయ్ కుమార్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన ముంజయ్ కుమార్‌ను 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతి చెందిన అభిషేక్ స్వస్థలం కేరళ రాష్ట్రం కాగా, గాయపడిన ముంజయ్ కుమార్ బిహార్‌వాసి. పట్టాలపై గ్యాంగ్‌మెన్ విధులు నిర్వహిస్తున్న సమయంలో రైళ్ల రాకపోకల సమయాన్ని తెలుసుకొంటూ సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన మేస్త్రీ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికార వర్గాలు భావిస్తున్నట్లు తెలిసింది.

సర్వైలెన్స్ ప్రాజెక్ట్ ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఏఎంఆర్ సర్వైలెన్స్ ప్రాజెక్టు, న్యూఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్(ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో గత నెల ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి ఫైనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఎస్వీ వైద్య కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోగలరని ఆయన తెలిపారు.

పుస్తకమే పతాకం..!

● పుస్తక ప్రదర్శనపై దాడిని ఖండిస్తూ తిరుపతిలో నిరసన ర్యాలీ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నిర్వహించిన 17వ పుస్తక ప్రదర్శనపై జరిగిన దాడి పట్ల పుస్తకాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బాలాజీ కాలనీలోని జ్యోతిబాపూలే విగ్రహం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. రామాయణం, భారతం, భాగవతం, మహాప్రస్థానం సహా ఎవరికి నచ్చిన పుస్తకాలను వారు జెండాలా చేతపట్టుకుని ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. టౌన్‌క్లబ్, ఎస్పీ ఆఫీస్, ప్రకాశం రోడ్డు, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం కూడలి, గాంధీ రోడ్డు మీదుగా నాలుగుకాళ్ల మండపం దాకా ర్యాలీ సాగింది. 'నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ', 'పుస్తకాలు జ్ఞాన నేత్రాలు, పుస్తకాలను చింపినంత మాత్రాన, పుస్తకాల్లోని భావాలను చంపలేరు' అంటూ నినదించారు. ర్యాలీలో భాగంగా తిరుపతి గాంధీరోడ్డులో గల విశాలాంధ్ర బుక్ హౌస్ ఎదురుగా నిలబడి సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. నాలుగు కాళ్ల మండపం వద్ద నిలబడి నిరసన తెలిపారు. పుస్తకప్రియులను ఉద్దేశించి పలువురు రచయితలు, ప్రజాసంఘాల నాయకులు ప్రసంగించారు. ఏ పుస్తకాలు చదవాలో, ఏ పుస్తకాలు చదవకూడదో నిర్ణయించడానికి ఎవరికీ హక్కు లేదని స్పష్టం చేశారు. పుస్తక ప్రదర్శనలోని ఒక స్టాల్ నుంచి పుస్తకాన్ని లాక్కొని, చించి పోగులు పెట్టి, దహనం చేయడానికి ప్రయత్నించిన దుండుగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విశాలాంధ్ర బుక్ స్టాల్‌పైనా దాడి చేసి స్వాతంత్ర్య సమరయోధుడు పెరియార్ పుస్తకాలు అమ్మరాదని ఆదేశించి, తీసేయించడం దారుణమన్నారు.

ఈ సందర్భంగా తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక అధ్యక్షుడు వాకా ప్రసాద్ మాట్లాడుతూ.. పుస్తకాలపై దాడి హేయమైన చర్య అని అన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎస్వీయూ ఇంగ్లీషు రిటైర్డు ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర, డాక్టర్ కడియాల వెంకటరమణ (అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు), సీనియర్ జర్నలిస్టు ఆలూరి రాఘవ, రచయితలు ఆర్ఎం ఉమామహేశ్వరరావు, మూరిశెట్టి గోవిందు, పేరూరు బాలసుబ్రమణ్యం, గొడుగుచింత గోవిందయ్య, నాగులూరు దయాకర్ పాల్గొన్నారు. ఇంకా నిర్మల, రెడ్డెప్ప (జన విజ్ఞాన వేదిక), వెంకటరమణ (సాహితీ స్రవంతి), మల్లారపు నాగార్జున (వేమన విజ్ఞాన కేంద్రం), నడ్డి నారాయణ (బాలోత్సవం), పరమేశ్వరరావు (పౌర చైతన్య వేదిక), సాకం నాగరాజ (జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు), యువశ్రీ మురళి (అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు), నెమిలేటి కిట్టన్న (అరసం జిల్లా కార్యదర్శి), తమటం రామచంద్రారెడ్డి (తెలుగు భాషోద్యమ సమితి),కందారపు మురళి (సీఐటీయూ), డాక్టర్ పి.సాయిలక్ష్మి (ఐద్వా జిల్లా కార్యదర్శి), లక్ష్మి (ఎస్‌యూసీఐ), వందవాసి నాగరాజు (సీపీఎం జిల్లా కార్యదర్శి), రామా నాయుడు (సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు), అంజయ్య (దళిత సాహిత్య వికాస వేదిక), వెంకటరత్నం (సీనియర్ కమ్యూనిస్టు నేత), ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం పెంచలయ్య, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, బీసీ సంఘర్షణ సమితి నేత లక్ష్మయ్య, యమలా సుదర్శన్ (దళిత శంఖారావం పత్రిక ఎడిటర్), జర్నలిస్టు సంఘం నాయకుడు ప్రసాద్, మస్తానమ్మ (శంకరంబాడి సాహిత్య పీఠం) తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పిచ్చాటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ రైతు పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పిచ్చాటూరు మండలం ముడియూరు పంచాయతీ లక్ష్మీవిలాసపురం గ్రామానికి చెందిన వై.చిట్టిబాబు(50)కు ఒకటిన్నర ఎకరా ఉంది. వరి, వేరుశనగ, చిక్కుడు తోట సాగుచేశారు. వచ్చిన కాస్త దిగుబడి గత తుఫాను వల్ల నష్టపోయారు. సాగుకు బ్యాంకులు, ప్రైవేటు వ్యక్తుల వద్ద సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారమైంది. అప్పు తీర్చే మార్గం కనిపించక సోమవారం మధ్యాహ్నం తన పొలంలో పురుగుల మందు తాగి పడిపోయారు. స్థానికులు గుర్తించి 108లో నగరి ఏరియా ఆస్పత్రికి.. అక్కడ్నుంచి తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య నఖిల, పిల్లలు కార్తీక్, ఆశ ఉన్నారు.



చిట్టిబాబు (ఫైల్ ఫొటో)

భర్త హత్య కేసులో బెయిల్‌పై వచ్చి ఆత్మహత్య



మృతి చెందిన సుజాత

రేణిగుంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భర్త హత్య కేసులో బెయిల్‌పై వచ్చిన భార్య మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రేణిగుంట మండలం కొత్రమంగళంలో చోటుచేసుకుంది. చెంగారెడ్డిపల్లి హరిజనవాడకు చెందిన కె.సుజాత(37), ఈశ్వరయ్య దంపతులు. నిత్యం మద్యంతాగొచ్చి అనుమానంతో భార్యను వేధించేవాడు. గతేడాది అక్టోబరు 23న దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. ఆ గొడవలో భర్త తలపై బలంగా కొట్టడంతో అతడు మృతిచెందాడు. ఈ హత్య కేసులో రిమాండ్‌లో ఉన్న సుజాత పది రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైంది. ఇంటికి రాగా, పిల్లలు ఆమెను దూరం పెట్టారు. గ్రామంలోనూ ఎవరూ పలకరించలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. కొత్రమంగళం హరిజనవాడలోని అంగన్వాడీ టీచర్ అయిన తన కోడలి ఇంటికి చేరింది. సోమవారం రాత్రి పాత పంచాయతీ భవనంలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్స్ రేడియోలాజికల్ ఫిజిక్స్ లెక్చరర్ పోస్టులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో అడహక్ బేసిస్ కన్సాలిడేటెడ్ ప్రాతిప్రదికన రేడియోలాజికల్ ఫిజిక్స్(మెడికల్ ఫిజిసిస్ట్) లెక్చరర్ పోస్టులకు ఈ నెల 19న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. రిజర్వేషన్ కింద ఎస్టీ 1, బీసీ-బి 1, ఈడబ్ల్యూఎస్ 1, ఓసీ 1 కింద ఈ నాలుగు పోస్టులకు దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. 42 ఏళ్ల లోపు వారు అర్హులని.. ఎంపికైన వారికి నెలకు రూ.61 వేల వేతనం ఉంటుందని ఆమె వివరించారు. వీటికి హిందూ మతానికి చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 19న పాత డైరెక్టరు కార్యాలయంలో నిర్వహించే వాక్‌ఇన్ ఇంటర్వ్యూకు అన్నీ ధృవీకరణ పత్రాలతో హాజరుకాగలరని ఆమె వివరించారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను చూడగలరన్నారు.

ఎర్రచందనం రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు

● కింది కోర్టు తీర్పునే ఖరారు చేసిన ఎర్రచందనం సెషన్స్ కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం సెషన్స్ కోర్టు ఏడీజే న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పుచెప్పారు. దీనికి సంబంధించి ఫారెస్టు అధికారి, కోర్టు సహాయ లైజన్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా తిరుపత్తూరుకు చెందిన స్వామినాథన్ అన్నామలై 2014లో శేషాచలం నుంచి చంద్రగిరి మండలం నడింపల్లి బస్టాపు వద్దకు స్మగ్లర్లు తీసుకొచ్చిన 292 కిలోల బరువు కల తొమ్మిది ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలించడానికి వాహనంలో ఎక్కిస్తున్నాడు. అటవీశాఖ అధికారులు పట్టుకుని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి 2018లో ఏడాది జైలు శిక్ష, రూ 10,000 జరిమానా విధించారు. దీనిపై నిందితుడు తిరుపతి ఎర్రచందనం సెషన్స్ కోర్టుకు వెళ్లారు. కింది కోర్టు తీర్పును యథావిధిగా అమలు చేయాలని ఎర్రచందనం సెషన్స్ కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి ఆదేశించారు. ఈ కేసులో స్పెషల్ పీపీ కోటేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. లైజన్ అధికారులుగా జె.చంద్రశేఖర రాజు, సహాయ లైజన్ అధికారులుగా వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

అదృశ్యమైన విద్యార్థినుల అప్పగింత



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన బాలికల గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన ఇద్దరు పదో తరగతి విద్యార్థినులను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని జానకిరామ్‌పేటలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో పదో తరగతి చదివే ఇద్దరు విద్యార్థినులు సోమవారం మధ్యాహ్నం నుంచి అదృశ్యమైనట్లు ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వెంకటనే పోలీసు బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. సోమవారం అర్ధరాత్రి డక్కిలి మండలం శ్రీపురం గ్రామంలోని బంధువుల ఇంటి వద్ద విద్యార్థినులు ఉండటాన్ని గుర్తించామన్నారు. మానసిక ఒత్తిడి కారణంగా విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారని, వారిని తల్లిదండ్రులకు అప్పగించామని వివరించారు. కార్యక్రమంలో రెండో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చీటీల పేరుతో మోసం

న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో రూ.5 కోట్లు మేర టోకరా పెట్టి పారిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు... సూళ్లూరుపేటలో పట్టణంలోని గాయత్రినగర్‌లో నివాసం ఉంటున్న కొటారు రమేష్ చీటీల నిర్వహణ పేరుతో పాత షార్ బస్టాండు వద్ద ఓ కార్యాలయాన్ని ప్రారంభించాడు. సూళ్లూరుపేటతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురి వద్ద చీటీలు వేయించారు. కొన్నాళ్లుగా చీటీ పాడుకున్న వారికి నగదు ఇవ్వకుండా మాయమాటలు చెబుతూ కాలం వెళ్లబుచ్చారు. చీటీ పాడుకున్న వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో వారం రోజులుగా కార్యాలయం తెరవలేదు. మంగళవారం ఇళ్లు కూడా ఖాళీ చేసి ఉండడంతో మోసపోయామని తెలుసుకొన్న బాధితులు తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



కయ్యూరు చెరువులో చేపలు వదులుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

బాలాయపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం బాలాయపల్లి మండలంలోని కయ్యూరు చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. చెరువుల్లో చేపల పెంపకం పంచాయతీల ఆర్థిక పరిపుష్టిని పెంచుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు, కయ్యూరు చెరువు ఆయకట్టు సొసైటీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, మండల ప్రధన కార్యదర్శి కూను శ్రీహరి, రాయి సత్యం నాయుడు, మల్లిమాల గోపీకృష్ణా రెడ్డి, బద్దెవోలు కళ్యాణ్‌రెడ్డి, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, శేఖర్, సీసీ నాయుడు, దాసరి కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు నిధుల మంజూరు

గూడూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.4.81కోట్లు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మంగళవారం పేర్కొన్నారు. రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, మరమ్మతులకు గురైన మంచినీటి సరఫరా పథకాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

జంపింగ్ రోప్ క్రీడాకారులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న హెచ్‌ఎం విజయలక్ష్మి, శ్రీకంటి రామమోహన్‌రావు, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

చిల్లకూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 9మంది జాతీయస్థాయి జంపింగ్ రోప్‌కు పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం రోటరీక్లబ్ సీనియర్ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు క్రీడాకారులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు జాతీయస్థాయి జంపింగ్ రోప్ క్రీడా పోటీలకు ఎంపిక కావడంతో ఆనందంగా ఉందన్నారు. రోటరీక్లబ్ సభ్యులు అందజేసిన ప్రోత్సాహక నగదును విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ దాదాపీర్ తెలిపారు. విద్యార్థులు మార్చి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు

ఓజిలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురౌతున్నట్లు ఫిర్యాదులు వస్తుండడంతో తహసీల్దారు పద్మావతి స్పందించారు. మంగళవారం వీఆర్వోలకు పలు సూచనలు ఇచ్చారు. బంజరు, ప్రభుత్వ, అనాధీనం భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని ఆదేశించారు. భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు.

దుకాణాల్లో తనిఖీలు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాల్లో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారిణి నర్మద తనిఖీలు నిర్వహించారు. కాలం చెల్లిన తినుబండారాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వర్ణముఖి బ్యారేజీ ఎత్తు పెంపు కలేనా!

వాకాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తీరప్రాంత మండలాలైన వాకాడు, కోట పరిధిలో పంటల సాగుకు స్వర్ణముఖి బ్యారేజీ ప్రధాన ఆధారం. వాకాడు మండలంలోని కల్లూరు, తూపిలి, నెలిపూడి, ముట్టెంబాక, దుర్గవరం, కోడివాక, తిరుమూరు, చీమలపాడు, దుగరాజపట్నం, కోట మండలంలోని పుచ్చలపల్లి చెరువుల పరిధిలో 9,700 ఎకరాల ఆయకట్టుకు బ్యారేజీ నుంచి సాగునీరు అందుతోంది. 2005లో రూ.50 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ బ్యారేజీ, చెరువులు, కాలువల పనులను 2008లో పూర్తి చేశారు. అప్పట్లో 0.035 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బ్యారేజీని నిర్మించారు. అయితే ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసే వర్షాలతో పోటెత్తే వరద నీటిని నిల్వచేసుకునే అవకాశం లేకపోవడంతో సముద్రంలోకి వదిలేయాల్సి వస్తోంది. ఇలా దీంతో ఏటా లక్ష క్యూసెక్కుల వరదనీరు సముద్రంలో కలుస్తోంది. ఈ నేపథ్యంలో 3 టీఎంసీల నీటిని అధికంగా నిల్వ చేసేలా బ్యారేజీ ఎత్తు ఒకటిన్నర అడుగు పెంచుతామని 2019లో ఎన్నికల సందర్భంగా వైసీపీ నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే లేకపోవడంతో వరద నీరు సముద్రం పాలవుతోంది. పైగా బ్యారేజీకి కనీస మరమ్మతులు చేయకపోవడంతో 34 గేట్‌లలో 20కి పైగానే తుప్పుపట్టి బ్రిడ్‌లు తెగిపోయే పరిస్థితి ఏర్పడటంతో నీటిని వృథాగా దిగువకు వదలాల్సి వస్తోంది. బ్యారేజీ ఎత్తును పెంచినట్లయితే వరద నీటిని నిల్వ చేసుకుని వినియోగించుకోవచ్చు. దీంతో వాకాడు, కోటతో



పాటు చిట్టమూరు మండలంలోని భూములకు సాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయి. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని బ్యారేజీ ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ కృష్ణయ్యను వివరణ కోరగా బ్యారేజీ మరమ్మతులు, చెరువులు, కాలువల అభివృద్ధి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని చెప్పారు.

సీబీఐసీ కోసం 985 ఎకరాలకు

రూ.78.84 కోట్ల పరిహారం

- కలెక్టర్ చొరవతో 600 మంది రైతులకు న్యాయం
- సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న వివాదానికి పరిష్కారం
- ఇటీవలి క్యాబినెట్ నిర్ణయంతో తాజాగా పరిహారం మంజూరు

తిరుపతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 2016 నుంచీ పెండింగులో ఉన్న సీబీఐసీ భూముల పరిహారం వివాదం ఎట్టకేలకు కలెక్టర్ చొరవతో పరిష్కారమైంది. దానికనుగుణంగా చిల్లకూరు, కోట మండలాల పరిధిలోని 600 మంది రైతులకు రూ.78.84 కోట్ల పరిహారం మంజూరైంది. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు 10 వేల ఎకరాలకుపైగా భూములు అవసరమయ్యాయి. వీటిని సేకరించే క్రమంలో చిల్లకూరు మండలం తమ్మినపట్నం, కోట మండలం కొత్తపట్నం మండలాల పరిధిలోని 985.60 ఎకరాల అనాధీన భూములను కూడా ప్రభుత్వం సేకరించింది. భూములను సీబీఐసీ ప్రాజెక్టు కోసం అప్పగించినప్పటికీ వాటికి సరైన రక్షణ లేకపోవడంతో స్థానిక రైతులు వాటిని ఆక్రమించి సాగు చేసుకోవడం ప్రారంభించారు. ఇటీవల సీబీఐసీ పనులు మొదలు కావడంతో ఈ 985 ఎకరాల భూములకు సంబంధించి రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సాల్ అధ్యక్షతన ఏడుగురు అధికారులతో కమిటీ వేశారు. సీబీఐసీ ప్రాజెక్టుకు ఈ భూములు కీలకం కావడంతో ఎలాగైనా వాటిని ప్రాజెక్టుకు అప్పగించాలనే ఉద్దేశంతో కలెక్టర్ చొరవ తీసుకున్నారు. గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచీ వినతులు, ప్రతిపాదనలు స్వీకరించారు. అయితే భూములకు పరిహారం మంజూరు చేయడంలో సాంకేతికంగా చిక్కులు ఎదురయ్యాయి. ఆ భూములను 600 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. దానికి సంబంధించి రెవెన్యూ శాఖలో ఎలాంటి రికార్డులూ లేవు. రైతులకు డీకేటీ పట్టాలు జారీ కాలేదు. అడంగల్‌లో గానీ, 10 (1) రికార్డుల్లో గానీ రైతుల సాగు ప్రస్తావన లేదు. దానికి తోడు సంబంధిత భూములను సీబీఐసీ ప్రాజెక్టు కోసం గతంలోనే స్వాధీనం చేసేసినట్టు భూసేకరణ రికార్డుల్లో పేర్కొన్నారు. అయితే సీబీఐసీ ప్రాజెక్టు ప్రాధాన్యత నేపథ్యంలో ఎలాంటి ఆధారాలూ లేకపోయినా సంబంధిత 600 మంది రైతులకూ ఎకరాకు రూ.8 లక్షలు చొప్పున పరిహారం చెల్లించి భూములు సేకరించాలని కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సీఎం చంద్రబాబు సైతం సమస్య పరిష్కారానికి ఆసక్తి చూపడంతో ఈనెల 6వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 600 మంది రైతులు సాగు చేసుకుంటున్న 985 ఎకరాలకు పరిహారం చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దానికనుగుణంగా మంగళవారం ప్రభుత్వం 600 మంది రైతులకు రూ. 78.84 కోట్లు పరిహారంగా మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐసీ ప్రాజెక్టు నేపథ్యంలో దీన్ని ప్రత్యేక కేసుగా పరిగణిస్తున్నామని, ఇతర కేసులకు ఈ నిర్ణయం వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



వాహనాదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ శివశంకర్

డక్కిలి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్ఐ శివశంకర్ వాహనదారులకు సూచించారు. మంగళవారం రాపూరు - వెంకటగిరి మార్గంలో వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధరించకుండా, మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10వేలు జరిమానా విధిస్తామని, రెండో సారి పట్టుబడితే జైలుకు పంపుతామని హెచ్చరించారు. అంతేకాకుండా సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపినా సీజ్ చేస్తామని ఎస్ఐ అన్నారు.

ప్రతి రైతూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

బాలాయపల్లి, నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని బాలాయపల్లి వ్యవసాయ అధికారిణి శిరీష, నాయుడుపేట వ్యవసాయశాఖ అధికారి గణేష్ కోరారు. రైతులు తమ పాస్ పుస్తకాలు, ఆధార్ నంబరుతో రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకుంటే గుర్తింపు సంఖ్య కేటాయించడం జరుగుతుందన్నారు. గుర్తింపు సంఖ్య లేకుండా రైతులకు పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్ట పరిహారం, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు తదితర పథకాలు అందవన్నారు.

పాఠశాల ఆటస్థలంలో గడ్డి మోపులు



తడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తడ మండలం వెండ్లూరుపాడు ప్రాథమిక పాఠశాల ఆటస్థలం గడ్డిమోపుల నిల్వ కేంద్రంగా మారింది. మొదటి విడత నాడు - నేడు పథకం కింద పాఠశాల ఆవరణలో ఆట స్థలాన్ని ఏర్పాటు చేశారు. మినీపార్కులా ఉండే ఈ స్థలానికి ప్రహరీ లేక పోవడంతో స్థానికులు కొందరు గడ్డిమోపులు నిల్వ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఆట స్థలాన్ని పిల్లలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

పుస్తక పఠనంతో విజ్ఞానం



గ్రంథాలయ ప్రారంభోత్సవంలో ఆనం అరుణమ్మ తదితరులు

గూడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఉమ్మడి నెల్లూరు జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. మంగళవారం గూడూర మండలంలోని చెన్నూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జొన్నా మోహనకృష్ణ, సునీతాదేవి దాతృత్వంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా అనేక కొత్త విషయాలను తెలుసుకుని జ్ఞానాన్ని పెంచుకోవచ్చునన్నారు. దాతలు ముందుకు వచ్చి గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సనత్‌కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు యామిని, తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లను పక్కాగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మస్తానయ్య

కోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలాల వారీగా స్కూల్ కాంప్లెక్స్ రివ్యూ సమావేశాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశించారు. మంగళవారం ఆయన అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ సూచనలమేరకు ఎంఈవో మస్తానయ్య కోట మండలంలో ఇప్పటి వరకు ఉన్న 6 స్కూల్ కాంప్లెక్స్‌లను 4కు కుదించారు. కోట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు చిట్టేడు, గోవిందపల్లి, ఉన్నత పాఠశాలలను నూతన స్కూల్ కాంప్లెక్స్‌లుగా ఏర్పాటు చేశారు. ఆయా కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో నెలకోసారి జరిగే రివ్యూ సమావేశాన్ని జరిపి విద్యాబోధనపై ముఖాముఖి చర్చలు నిర్వహించాలని కోరారు. విద్యా బోధనలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనాంశాల మార్పులపై అడుగులు వేయాలని ఎంఈవో సూచించారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ, పక్కన అధ్యాపకులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రకాల పోటీ పరీక్షలకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ బి.శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ రాజా, సునీత, ఏడుకొండలు, అమ్మాజీ, ఉషారాణి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టెనెక్టిప్లస్ ఇంజక్షన్‌తో గుండెకు భరోసా



గుండెకు భరోసా పత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రూప, వైద్యాధికారులు

కోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టెనెక్టిప్లస్ ఇంజక్షన్‌తో గుండెకు భరోసా లభిస్తుందని వైద్యాధికారిణి రూప తెలిపారు. కోటలోని ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం గుండెకు భరోసా కార్యక్రమం జరిగింది. ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ రూప ఆధ్వర్యంలో గుండె వ్యాధులు, వాటి లక్షణాలు, అత్యవసర చికిత్స వంటి సేవలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్లు రూప, రాజశేఖర్, మాధూరి మాట్లాడుతూ గుండెపోటు బారినపడిన వారికి వెంటనే టెనెక్టిప్లస్ ఇంజక్షన్ ఇస్తే ప్రాణాలను రక్షించవచ్చన్నారు. రూ.45వేల విలువ చేసే ఈ ఇంజక్షన్‌ను ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఛాతిలో నొప్పి, ఎడమ వైపు భుజం లాగడం, ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కన్పిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వాస్పత్రులకు వెళ్లితే టెనెక్టిప్లస్ ఇంజక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

మామిడిలో పిందె దశలో సంరక్షణ చర్యలు చేపట్టాలి



పూత దశలో ఉన్న మామిడి చెట్టు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మామిడి పంటలో పిందె దశలో సంరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం, జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ మెరుగు భాస్కరయ్య మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కాస్త ఆలస్యమైనా చాలా చోట్ల పూత బాగా వస్తుందన్నారు. ఈ దశలో కొత్తగా ఏర్పడుతున్న పిందెలను చీడలు ఆశించి అధికంగా రాలిపోతోందన్నారు. పిందెలు జొన్నగింజ, బఠానీ సైజులో ఉన్నప్పుడు మంగును కలుగచేసే పురుగులు, ఆకుమచ్చ తెగులు ఆశించి నష్టపరుస్తాయని చెప్పారు. ఈ చీడల నివారణకు ప్రిప్రోనిల్(లీటరుకు 2మి.లీ.) లేదా సైనోసాడ్(లీటర్‌కు 0.3మి.లీ.)తోపాటు సాఫ్(లీటర్‌కు 2.5గ్రాములు లేదా కవచ్ లీటర్‌కు 2 గ్రాములు) కలిపి స్ప్రే చేయాలన్నారు. చెట్లలో పిందెలు రాలకుండా 15 రోజులకు ఒకసారి నీరు పెట్టాలని సూచించారు. 13-0-45(మల్టీ-కే) లీటరుకు 10గ్రాములు, యూరియా లీటరుకు 10 గ్రాములు, ఆగ్రోమిన్ మ్యాక్స్ (ఫార్ములా-4) లీటరుకు 2.5గ్రాములు కలిపి స్ప్రే చేయాలని సూచించారు. దీంతో పిందెలు రాలడం తగ్గిపోయి కాయలు పెద్దసైజులో పెరిగి అధిక దిగుబడి వస్తుందని ఆయన తెలిపారు.

నేత్రదానం



వల్లెమ్మ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన సూళ్లూరు వల్లెమ్మ(67) మంగళవారం మృతి చెందింది. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు చెన్నై శంకర నేత్రాలయకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంఎం.చంద్రబాబు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీలో వ్యభిచారం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం పోలీసులు ఓ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు విటులు, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ మహిళతో పాటు మరో ఇద్దరు పురుషులపై కేసు నమోదు చేశారు.

సర్వేలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వేణు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వ సర్వేలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మండలంలోని 21 పంచాయతీల్లో సంక్షేమ పథకాలపై జరుగుతున్న ఇంటింటి సర్వేపై ఆరా తీశారు. కొన్ని పంచాయతీల్లో సర్వేల నిర్వహణలో జాప్యం జరుగుతుండటంతో ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీల వారీగా సర్వేను వేగవంతం చేయాలని, లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ



గూడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్నూరు గ్రామంలో మంగళవారం వేకువ జామున గుర్తుతెలియని వ్యక్తులు పంట పొలాలకు విద్యుత్ సరఫరా అందజేసే రెండు 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్లను ఎత్తుకెళ్లారు.

మెట్ట చెరువుల్లోకి చేరిన గంగనీరు

కోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కండలేరు నుంచి విడుదల చేసిన తెలుగుగంగ జలాలు మంగళవారం కోట మండలంలోని మెట్ట చెరువుల్లోకి చేరాయి. ఏఈ నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులు 5వ బ్రాంచ్ కెనాల్ ద్వారా 20 క్యూసెక్కుల నీటిని మండలంలోని కేశవరం, రాఘవాపురం, చిల్లకూరు మండలం తొణుకుమాల చెరువుల్లోకి సోమవారం వదిలారు.

మతిస్థిమితంలేని వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేకుండా చెరువులో దిగి నీటిలో వ్యక్తిని ఒకటో పట్టణ పోలీసులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. గత రెండు రోజులుగా ఓ వ్యక్తి మతిస్థిమితం లేకుండా స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని చెరువులో నీటిలో ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మతిస్థిమితం లేని వ్యక్తిని పోలీసులు చెరువులో నుంచి బయటకు తీసుకువచ్చి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఐతేపల్లె వద్ద ఢీకొన్న కార్లు

చంద్రగిరి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె వద్ద మంగళవారం ఉదయం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు గూడూరు ఎమ్మెల్యే సునీల్ పీఏ చంద్రకు చెందిన కారు బెంగళూరు నుంచి గూడూరుకు వెళ్లోంది. ఐతేపల్లె వద్ద ఈ కారును వెనుక వస్తున్న మరో కారు ఢీకొంది. దీంతో వెనుక కారులోని కర్నాటకకు చెందిన సీత్‌రాజ్‌కు గాయాలయ్యాయి. ముందు కారులో చంద్ర, డ్రైవ్ అబ్బులకు స్వల్ప గాయా లయ్యాయి. సీత్‌రాజ్‌ను రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. దట్టమైన పొగ మంచు కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.